
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

బుధవారం 25 డిసెంబరు 2024



ఎరువుల సమస్యలా...?

కాల్ సెంటర్‌కు ఫోన్ చేయండి

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు ఎరువుల కోసం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాలతో జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో కాల్‌సెంటరును ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి పీ సత్య వాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎరువుల దుకాణాల్లోనూ, సొసైటీల్లోనూ యూరియాను నిర్ణయించిన ధర కంటే ఎక్కువకు అమ్ముతున్నా, అలాగే నిల్వలు ఉండి పంపిణీ చేయకపోయినా కాల్ సెంటర్ నంబర్లు 83310 57182, 83310 57218, 83310 57184, 83310 58204, 83310 57258లకు ఫిర్యాదు చేయాలని ఆమె పేర్కొన్నారు.

2024.. జిల్లా రాజకీయాలపై చెరగని ముద్ర వేసింది. కొత్త ముఖాలను రాజకీయ అందలం ఎక్కించింది. రాజకీయ వలసలను ప్రోత్సహించింది. ఐదేళ్లపాటు అధికారం చలాయించిన నాయకులను అడ్రస్ లేకుండా చేసింది. రాజకీయ భవిష్యత్తు కోసం సైకిల్ ఎక్కిన వారికి పదవులను అదించింది. ఇద్దరికి అమాత్య యోగం కల్పించింది. నమ్మిన పార్టీ కోసం శ్రమించిన నాయకులను నామినేటెడ్ పదవులతో సత్కరించింది. విలువలకు తిలోదకాలిచ్చి గతంలో ఎప్పుడూ లేని విధంగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది. అధికారం తమ శాశ్వత హక్కుగా భావించి రాచరికాన్ని తలపించేలా పాలన సాగించిన వైసీపీ నాయకుల జాతకాలను తలకిందులు చేసింది. సంపూర్ణ ఆధిక్యంతో నవశకానికి నాంది పలికింది.



అటు.. ఇటుగా అధికారం

- కొత్త ముఖాలకు రాజకీయం అందలం
- నామినేటెడ్ పదవుల్లో పలువురికి సముచిత స్థానం
- వైసీపీ నేతలకు కోలుకోలేని దెబ్బ
- నేతల గతులు మార్చిన ఏడాది

తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి (ఎన్డీఏ) రాజకీయంగా 2024 కొత్త జీవం పోసింది. కందుకూరు సహా ఉమ్మడి నెల్లూరు జిల్లా చరిత్రలో తొలిసారిగా పదికి పది అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానాన్ని కూటమి గెలుచుకుంది. కాంగ్రెస్, ఆ తరువాత వైసీపీకి కంచుకోట లాంటి జిల్లాలో తెలుగుదేశం పార్టీ అన్ని స్థానాలను గెలుచుకోవడం సరికొత్త రికార్డుగా నిలిచింది.

కొత్త ముఖాలకు రాజకీయ యోగం

కేవలం రెండు మూడు కుటుంబాలు రాజకీయాలను శాసించే జిల్లాలో తొలిసారిగా కొత్త ముఖాలకు అందలం దక్కింది. కందుకూరు నుంచి ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరి నుంచి కాకర్ల సురేష్, కావలి నుంచి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి (కావ్య కృష్ణరెడ్డి), కోవూరు నుంచి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు తొలిసారిగా అసెంబ్లీకి పోటీ చేసి గెలుపొందారు. వ్యాపారులుగా పారిశ్రామికవేత్తలుగా స్థిర పడిన వీరు రాజకీయ తెర పైకి రావడం, ఎమ్మెల్యేలు కావడం విశేషం. జిల్లాలో మొత్తం 8 అసెంబ్లీ స్థానాలు ఉండగా అందులో నలుగురు తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగి విజయం సాధించిన వారే. ఇక నెల్లూరు ఎంపీగా గెలిచిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సైతం ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ పడటం ఇదే తొలిసారి. మొత్తమ్మీద అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో గెలిచిన దాదాపు 50 శాతం మందికి ఈ ఏడాది రాజకీయంగా కొత్త జీవితం ప్రసాదించింది.

● ఇద్దరికి అమాత్యయోగం

ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో తొలి క్యాబినెట్‌లో జిల్లాలో ఇద్దరికి అవకాశం లభించడం ఒక విశేషంగానే చెప్పుకోవాలి. నెల్లూరు నగర ఎమ్మెల్యే పొంగూరు నారాయణ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రిగా, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిగా కొలువుదీరారు.

● విధేయులకు పట్టం

నామినేటెడ్ పదవుల్లో సైతం జిల్లాకు సముచిత స్థానం దక్కింది. పార్టీ కోసం ఎమ్మెల్యే టికెట్లు త్యాగం చేసిన అబ్దుల్ అజీజ్‌కు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ పదవి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి నుడా చైర్మన్, పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పదవి దక్కింది. అలాగే టీడీపీ నేతలు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డికి సివిల్‌సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, ఆనం వెంకట్రమణారెడ్డికి ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ బోర్డు కో-వైస్‌చైర్మన్‌గా, జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్‌కు రాష్ట్ర టిడ్కో చైర్మన్‌గా, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ పదవి దక్కింది. తొలివిడత నామినేటెడ్ పదవుల కేటాయింపులోనే నెల్లూరు జిల్లాకు చెందిన ఏడుగురు నాయకులకు గుర్తింపు కలిగిన కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లుగా అవకాశం కల్పించడం జిల్లా చరిత్రలో తొలిసారి కావడం విశేషం.



అజయ్‌కుమార్



సురేష్‌రెడ్డి

● జనసేన, బీజేపీలకు కొత్త జీవం

2024వ సంవత్సరం నెల్లూరు జిల్లా పరిధిలో జనసేన, బీజేపీలకు కొత్త జీవం పోసింది. అంతకముందు జిల్లాలో ఈ రెండు పార్టీల ప్రభావం చాలా తక్కువనే చెప్పాలి. జనసేన పార్టీకి క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణమే జరగకపోయినా, ప్రజా క్షేత్రంలో బీజేపీ ఉనికి అంతంత మాత్రంగానే ఉన్నా తెలుగుదేశం పార్టీలో జట్టు కట్టడం జిల్లా పరిధిలో ఆ పార్టీలకు బాగా కలిసొచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లా పరిధిలోనూ ఈ రెండు పార్టీలకు ప్రజల్లో, అధికార యంత్రాంగంలో గుర్తింపు పెరిగింది. రాజకీయ కార్యక్రమాలకే కాకుండా నామినేటెడ్ పదవుల్లోనూ ఈ పార్టీల నాయకులకు భాగస్వామ్యం లభించింది. తొలివిడత నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో జనసేన, బీజేపీ నాయకులకు కీలకమైన టిడ్కో, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పదవులు దక్కాయి. చివరికి సాగునీటి సంఘ ఎన్నికల్లోనూ ఆ పార్టీల నేతలకు 10 శాతం సీట్లు కేటాయించారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)

● అడ్రస్ లేని వైసీపీ

కూటమి పార్టీలకు 2024 తీపిని పంచితే ఐదేళ్లపాటు అధికారం చెలాయించిన వైసీపీకి మాత్రం చేదును కాదు ఏకంగా గరళాన్నే పంచిపెట్టింది. అధికారం తమ శాశ్వత హక్కుగా భావించి రాజరికాన్ని తలపించేలా పాలన చేసిన వైసీపీ నాయకులను అడ్రస్ లేకుండా చేసింది. కావలిని సామ్రాజ్యంగా భావించి విపక్షాలపై విరుచుకుపడి, పలువురు బలవన్మరణాలకు కారకుడిగా ఆరోపణలు మోసిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని కావలి ప్రజలు దారుణంగా దెబ్బతీశారు. ఈ ఓటమి భారాన్ని తట్టుకోలేక ఆయన ప్రస్తుతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అయినదానికి కానిదానికి తొడలు చరిచి మీసం మెలేసిన మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ పక్కరాష్ట్రంలో విశ్రాంతి తీసుకొంటున్నారు. అంతే స్థాయిలో చెలరేగిపోయిన నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి హైదరాబాద్‌కు చేరిపోయారు. ఇక ఆత్మకూరులో మేకపాటి కుటుంబానికీ పరాభవం తప్పలేదు. దేశం అంతటికి ఒక రాజ్యాంగం అయితే సర్వేపల్లికి మాత్రం ప్రత్యేక రాజ్యాంగంగా అధికారం చెలాయించిన కాకాణి గోవర్ధన్‌రెడ్డికి ఘోర పరాజయం అనివార్యం అయ్యింది. జగన్ తరువాత జగన్ అంతటివాడిగా (నెం.2) చెలామణి అయిన విజయసాయిరెడ్డినీ జిల్లావాసులు కోలుకోలేని దెబ్బతీశారు. కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి భారీ మెజారిటీ ఇచ్చి విజయసాయి ఇమేజ్‌కి సున్నాచుట్టారు. మొదటి ఆరు నెలల్లో జిల్లా అంతా తమదే అన్నట్లు ధీమాగా కనిపించిన వైసీపీ నాయకులు ఏడాది ముగిసే సరికి ప్రజలకు కనిపించకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయేలా చేయడం 2024వ సంవత్సరం ప్రత్యేకత.



'ఉపాధి'కి ప్రత్యేక ప్రణాళిక..

15 శాతం వృద్ధిరేటు

- ఆ లక్ష్యంతోనే పని చేస్తున్నాం
- ఇక సాగులో రైతులకు ఇబ్బందులు రానీయం
- కలెక్టర్ ఆనంద్ వెల్లడి



ఉపాధి హామీ పథకం అమలు పై ప్రత్యేక ప్రణాళిక రూపొందించు కొని ముందుకెళుతున్నాం. పేదలకు ఉపాధి అవకాశాలు మెరుగు పరచడంతోపాటు తద్వారా మెటీరి యల్ కాంపోనెంట్‌ను జనరేట్ చేస్తున్నాం. ఈ కాంపోనెంట్‌తో గ్రామాల్లో విస్తృతంగా సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నాం. ఇక స్వర్ణాంధ్ర విజన్ 2047ను రూపొం దించుకున్నాం. దానిని పక్కాగా అమలు చేసి 2029లోపు 15 శాతం వృద్ధిరేటు సాధించే విధంగా చర్యలు చేపట్టాం.' అని కలెక్టర్ ఓ ఆనంద్ వివరించారు. 'ఈ ఏడాది పూర్తి ఆయక ట్టులో పంటల సాగు జరుగుతోంది. ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో చివరి ఎకరా వరకూ నీరు అందిస్తున్నాం. ఎక్కడా రైతులకు ఇబ్బందులు రానీయం. అనధికారికంగా యూరియాను నిల్వ చేస్తున్న వ్యాపారులపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఎరువుల దుకాణాల్లో తనిఖీలకు వివిధ శాఖలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నాం.' అని వెల్లడించారు. జిల్లా అభివృద్ధికి చేపట్టిన పలు ప్రణాళికలు, వాటి అమలుకు తీసుకుం టున్న చర్యలను కలెక్టర్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఈ ఇంటర్వ్యూ

- వివరాలు 6లో

సమానత్వమే క్రీస్తుతత్వం!

- నేడు క్రిస్మస్
- జిల్లా అంతటా వేడుకలు
- ముస్తాబయిన ప్రార్థనామందిరాలు

శాంతిని, సమానత్వాన్ని చాటిన ప్రేమమూర్తి క్రీస్తు పుట్టినరోజు సంబరాలకు సర్వం సిద్ధమైంది. బుధవారం జిల్లా అంతటా క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే కొన్ని రోజులుగా క్యారల్స్‌తో ఏసు బోధనలు ప్రచారం చేస్తున్న క్రైస్తవులు మంగళవారం ప్రార్థనల్లో గడిపారు. అర్ధరాత్రి బాల ఏసుకు ఆహ్వానం పలుకుతూ సంబరాలు జరుపుకున్నారు. క్రిస్మస్ కోసం అన్ని చర్చిలు, ప్రార్థనా మందిరాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు.

అంబరాన్నంటిన సంబరం

నగరంలోని బిషప్ హౌస్‌లో మంగళవారం అర్ధరాత్రి క్రిస్మస్ వేడుకలు అంబరాన్ని అంటాయి. ఈ సంబరాలలో బిషప్ హౌస్‌లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. చర్చి ఫాదర్‌లు బైబిల్ చదువుతుండగా, సువార్త గాయకులు క్రీసు నామస్మరణలను వీనులవిందుగా ఆలపించడంతో భక్తులు మైమరిచిపోయారు. క్రీస్తు జనన సమయం లో జరిగిన ఆనాటి ఘటనలను గుర్తు చేస్తూ ఈ వేడు కలు జరిగాయి. అర్ధ రాత్రి సమయంలో బాల యేసు జనన ఘట్టం విశేషంగా ఆకట్టు కుంది. భక్తులకు బాల ఏసును చూపిం చి దైవ కన్యక లుగా ఉన్న యువతు లతో కలిసి ఆ ప్రాంగ ణంలో ఊరేగింపుగా తీసుకు వచ్చి పశువుల పాకలో ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం బిషప్ ఎండీ ప్రకాశం మాట్లాడుతూ క్రీస్తు ప్రభువు శాంతి లోకకల్యాణం కోసం శిలువపై తన రక్తధారలు కురిపించిన మహనీయుడని తెలిపారు. క్రీస్తు చూపిన ప్రేమ, దయ, పరోపకారం, శాంతి, సామరస్యాలతో భారతదేశం, ప్రపంచం వర్ధిల్లా లని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీల నాయకులు, నగర ప్రముఖులు పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



బాలయేసును చూపుతున్న బిషప్ ఎండీ ప్రకాశం



- వివరాలు 6లో

'కాకాణి' అనుచరుడికి

రిమాండ్

- జైలుకు వెంకటశేషయ్య తరలింపు

వెంకటాచలం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగం ఆశ చూపి ఓ మహిళపై లైంగికదాడి కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్యకు న్యాయస్థానం 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. వెంకటాచలం పంచాయతీ దొడ్డరాజుపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా పనిచేస్తూ కుటుంబ కలహాల నేపథ్యంలో 2021లో ఆత్మహత్య చేసుకున్నాడు. తన భర్త ఉద్యోగం తనకు ఇప్పిస్తానంటూ ఆశ చూపించి, తనపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంకటశేషయ్యను పోలీసులు సోమవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. రాత్రంతా నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గడిపిన వెంకట శేషయ్యకు మంగళవారం ఉదయాన్నే వైద్యులతో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట ఆయన్ను హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు వెంకటశేషయ్యను జైలుకు తరలించారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో ఉత్కంఠ నెలకొంది. వెంకటాచలం పంచాయతీలో ఉన్న బాధితురాలి అత్తమామ ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించి కేసుకు సంబంధించిన పలు ధ్రువీకరణ పత్రాలను స్వాధీనం చేసుకుని న్యాయమూర్తి ఎదుట ఉంచారు. న్యాయస్థానంలో ఎంతో ఉత్కంఠభరితంగా వాదనలు జరగ్గా న్యాయమూర్తి జనవరి 6వ తేదీ వరకు రిమాండ్ విధించారు. వాదనలు జరిగే వరకు కోర్టు ప్రాంగణంలోనే వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

ఉన్నతాధికారులు రాని సమావేశాలు ఎందుకు!?

- ఇలాగైతే సమస్యలు పరిష్కారం అవుతాయా!?
- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యుల ఆగ్రహం

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ స్టాండింగ్ సమావేశాలకు ఉన్నతాధికారుల రాకపోతే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని, ఇక సమావేశాలు నిర్వహించడం దేనికని జడ్పీ స్టాండింగ్ కమిటీ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని జడ్పీ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఆరు జడ్పీ స్థాయీ సమావేశాలు నిర్వహించి ఇరిగేషన్, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమ శాఖలపై సభ్యులు సమీక్షించారు. ఇరిగేషన్, వ్యవసాయ, మత్స్య తదితర శాఖల ఉన్నతాధికారులు సమావేశానికి హాజరు కాకపోవటంపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులే రాకపోతే సమావేశాలు నిర్వహించి ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. కోర్టు విధుల కోసం తమ ఉన్నతాధికారులు వెళ్లారని ఆయా శాఖల అధికారులు వివరణ ఇచ్చుకున్నారు.

● 'ఇరిగేషన్' తీరు బాగోలేదు!

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారుల తీరు దారుణంగా ఉందని దుయ్యబట్టారు. నగరంలోని జాఫర్‌సాహేబ్ కాలువ పక్కన వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే దానిపై దుకాణాలు పెడుతున్నారని దీనిపై తాను ఇరిగేషన్ శాఖాధికారులను ప్రశ్నిస్తే సమాధానం రాలేదన్నారు. దీంతో ఆ శాఖ ఈఈ అక్కడ నుంచి ఎస్‌ఈకి ఫోన్ చేసి ఎమ్మెల్సీతో మాట్లాడించారు. దుకాణాల ఏర్పాటుపై పూర్తి నివేదికను ఈ వారంలోనే అందిస్తామని ఎమ్మెల్సీకి తెలిపారు.

● రోడ్లు బాగు చేయించండి

జడ్పీటీసీ సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, గనపం బాలకృష్ణారెడ్డి, వెంకట్రావు, రాఘవులు తదితరులు మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వాటి మరమతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దీనిపై పంచాయతీ రాజ్ ఎస్‌ఈ అశోక్ కుమార్ మాట్లాడుతూ పల్లెపండుగ ద్వారా రూ.70 కోట్ల పనులు జరుగుతున్నాయని, వర్షాల వల్ల పనుల్లో ఆలస్యం జరుగుతోందన్నారు. జనవరి కల్లా అన్ని పనులు పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. అలాగే పాఠశాల్లో ఉన్న ఆర్వో ప్లాంట్లు సక్రమంగా పనిచేయడం లేదని పలువురు జడ్పీ సభ్యులు తెలపటంతో చైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ ఆర్వోప్లాంట్లు నిర్వహణకు అధిక ప్రాధన్యత ఇవ్వాలని సూచించారు. అలాగే చిన్న చెరుకూరు జడ్పీ పాఠశాల్లో నూతన ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు.

● బిల్లులు మంజూరు చేయండి

కావలి జడ్పీటీసీ సభ్యుడు రాఘవులు మాట్లాడుతూ గతంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లీనిక్ భవనాలు నిర్మించగా, వాటి బిల్లులు మంజూరు చేయలేదన్నారు. దీనిపై పంచాయతీ రాజ్ ఎస్‌ఈ వివరణ ఇస్తూ ఎంబుక్‌లను అప్‌లోడ్ చేయించి బిల్లులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మర్రిపాడు జడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సోమశిల ఉత్తర కాలువ పనులకు సంబంధించి రైతులకు నష్ట పరిహారం ఇప్పటివరకు చెల్లించ లేదని, అలాగే పశువుల డాక్టర్ల పోస్టుల భర్తీలో మెట్ట ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే జయశ్రీ, జడ్పీ సీఈవో విద్యారమ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ అరుణమ్మ, సీఈవో విద్యారమ, ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి తదితరులు

● 'విజయదీపిక' ఆవిష్కరణ

జిల్లాలోని జడ్పీ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు ప్రతి ఏడాది అందిస్తున్న విజయదీపిక స్టడీ మేటిరియల్‌ను జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాసంవత్సరంలో 15,597 మంది విద్యార్థులు టెన్త్ పరీక్ష రాయనున్నారని, వారంతా మంచి ఫలితాలు సాధించేందుకే ఈ స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్లు చెప్పారు.



విద్యుద్దీప వెలుగుల్లో శాంతాక్లాజ్



నెల్లూరు : బిషప్ చర్చిలో విద్యుత్ అలంకరణ

- నేడు క్రిస్మస్
- జిల్లా అంతటా వేడుకలు
- ముస్తాబయిన ప్రార్థనామందిరాలు

సమానత్వమే క్రీస్తుతత్వం!





దివిలో మహిమాన్వితం.. భువిలో ఆనంద భరితం కలిగించేలా క్రైస్తవులకు కాంతి - శాంతి ప్రసాదించిన మంగళస్వరూపుడైన బాలయేసు పుట్టిన రోజే క్రిస్మస్. ఈ పండుగను సప్తపండుగల సమ్మేళనంగా క్రైస్తవులు జరుపుకొంటారు. వేల సంవత్సరాలుగా ఆ మహనీయుని బోధనలు మానవాళికి సన్మార్గం చూపుతున్నాయి. పాపు భారం మోసేందుకు పశువుల పాకలో ఆయన జన్మించిన రోజును ఏటా క్రైస్తవులు క్రిస్మస్ పర్వదినంగా జరుపుకుంటారు. ప్రతి ఇల్లు, చర్చిలపై స్టార్స్‌ను ఏర్పాటు చేసి క్రీస్తు రాకకు ఆహ్వానం పలికారు. జిల్లాలో దాదాపు 4వేలకుపైగా చర్చిలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. లోక రక్షకుడు భూమిపై దేవుని కుమారుడిగా అవతరించిన నాటి సంఘటనలను క్రైస్తవ సోదరులు స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలు, క్యారల్స్, సువార్త గీతాలు, బైబిల్ అధ్యయనం, నాటకాలు వంటి కార్యక్రమాలలో క్రైస్తవ కుటుంబాలు పాల్గొన్నాయి. నగరంలోని బిషప్ హౌస్‌లోని రోమన్‌కాథలిక్ చర్చి, తెలుగు బాప్టిస్టు చర్చి, లోన్‌స్టార్ చర్చి, డౌనీహాల్, లండన్ చర్చిలతోపాటు అన్ని ప్రార్థనా మందిరాలు విద్యుద్దీపాలతో శోభిల్లుతున్నాయి. పేదల సంతోషం కోసం అన్నదానాలు, వస్త్రదానాలు చేయనున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

దేశం అభివృద్ధి పథంలో నడవాలి



క్రీస్తు ప్రబోధించిన శాంతి, క్షమ, పరోపకారం సేవలతో జిల్లా ప్రజలతా కలిసిమెలసి ఉండాలి. ఒకరినొకరు స్నేహభావంతో సహకరించుకోవాలి. క్రీస్తు దయతో దేశం పాడి పంటలు, శాంతిసౌభాగ్యాలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని నిరంతరం క్రైస్తవులు క్రీస్తును ప్రార్థిస్తున్నారు. అందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు.

- నెల్లూరు బిషప్ డాక్టర్ ఎం.డి.ప్రకాశం

నక్షత్రం.. ఓ సందేశం!

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్.. క్రైస్తవులకు ఒక ముఖ్యమైన పర్వదినం. ఆ పర్వదినాన్ని పురష్కరించుకుని క్రైస్తవుల ఇంట విద్యుత్ వెలుగులతో పాటు ఒక నక్షత్రాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేస్తుంటారు. దేవుడు, మనుషులకు మధ్య ఉన్న సంబంధాన్ని నక్షత్రం తెలియజేస్తుందని వారి ప్రగాఢ విశ్వాసం. నక్షత్రంలో రెండు త్రిభుజాలు ఉంటాయి. పైకి ఉండే త్రిభుజం దేవుడిని, కిందకు ఉండే నక్షత్రం మానవుడిని సూచిస్తుంది. ఈ రెండు త్రిభుజాలు కలిగిన నక్షత్రం వారి నడుమ ఉన్న సంబంధాలకు సంకేతమని క్రైస్తవుల ప్రగాఢ విశ్వాసం. నక్షత్రాల ఆరు మూలలను గమనిస్తే ఇందులో కనిపించే ప్రతి మూలం ఒక విషయాన్ని తెలియజేస్తుందని క్రైస్తవులు చెబుతున్నారు. పైమూల దేవుడిగా, రెండోది సృష్టిగా, మూడోది ప్రత్యక్షతగా, నాల్గవది విమోచనగా, ఐదవది ఇశ్రాయేలుగా, ఆరవది అన్యులుగా తెలియజేస్తుందని పేర్కొంటున్నారు. దేవుడు మానవాళి కోసం లోకానికి వచ్చారని, ప్రత్యక్షంగా వారి పాపాలను విమోచన కల్పించేదని, ఇశ్రయేలుకు, అన్యులకు రక్షణ కల్పించాడని వారి నమ్మకం. నక్షత్రంలో ఉండే 12 గీతాలు 12 ఇశ్రాయేలుల గోత్రాలను తెలియజేస్తుందని క్రైస్తవులు చెబుతున్నారు. జిల్లాలోని క్రైస్తవులు నక్షత్రాలను కొనుగోలు చేసి ఏటా క్రిస్మస్ రోజున ఇంటి ఆవరణలో సర్వాంగ సుందరంగా అలంకరించుకుంటారు. ఇంటి ఆవరణలు, ప్రార్థన మందిరాల్లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీలకు కూడా ఈ నక్షత్రాలను అలంకరించడం ఆనవాయితీ.



టీడీపీ కార్యాలయంలోనూ సంబరాలు

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం క్రిస్మస్ ముందస్తు సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంచారు. దేవుడిని అనుసరిస్తే అంధకారం నుంచి బయటపడతామని అన్ని మత గ్రంథాలు చెబుతున్నాయని అన్నారు. ఊరందూరు సురేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు, దేవుని పాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, డేవిడ్ పాస్టర్, నాయకులు పీఎల్‌రావు, మామిడాల మధు, పెంచల నాయుడు, సాబీర్‌ఖాన్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 60 మంది పాస్టర్లకు క్రిస్మస్ కానుకగా డిన్నర్ సెట్లను బహూకరించారు.



క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న అబ్దుల్ అజీజ్, నాయకులు తదితరులు

మంత్రి, ఎంపీ, కలెక్టర్ శుభాకాంక్షలు

రాష్ట్ర, జిల్లా ప్రజలకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు జీవనం అందరికీ ఆదర్శప్రాయమని, ఆ కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలకు ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఓ ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కష్టంలోనే విజ్ఞానం వికసిస్తుందన్న సందేశాన్ని ఇచ్చి క్రీస్తు అందరినీ సన్మార్గం వైపు నడిపించారని తెలిపారు. కాగా, జిల్లా ప్రజలకు కలెక్టర్ ఓ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కే కార్తీక్, ఎస్పీ జీ. కృష్ణకాంత్ వేర్వేరుగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్‌ను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.



నెల్లూరులో 'రత్నం' విద్యార్థుల వేషధారణ

ఉదయగిరిలో 139 ఏళ్లనాటి చర్చి

ఉదయగిరి (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ పాలనకు చిహ్నంగా... ఎందరో విశ్వాసులకు ప్రార్థనా నిలయంగానూ.. ప్రార్థించిన విశ్వాసుల హృదయాలకు శాంతి, కరుణ, జాలి అందించే కేంద్రంగానూ భాసిల్లుతోంది... ఉదయగిరిలోని బర్డిట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి. ఈ ప్రాంతంలోకెల్లా ఇదే పెద్ద చర్చి కావడంతో వందల సంఖ్యలో భక్తులు వస్తారు. ఉదయగిరి గ్రామంగా రూపుదిద్దుకుంటున్న రోజుల్లోనే వంద ఎకరాల విశాల ప్రాంగణంలో బ్రిటీష్‌వారు ఈ చర్చిని నిర్మించారు. ఉదయగిరిలో ఇటీవల పలు చర్చిలు నిర్మించినా పురాతన చర్చి కావడంతో ఇక్కడ జరిగే క్రిస్మస్ వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారు.



● ఘన చరిత్ర

బర్డిట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చిది 139 ఏళ్ల ఘన చరిత్ర. 1881లో స్టేయిట్ దొర ఉదయగిరిలో చర్చి నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అప్పట్లో విద్యా, మత వ్యాప్తి కోసం అమెరికాకు చెందిన డౌనీ అనే దౌత్యవేత్త జేఎఫ్ బర్డిట్‌ను ఒంగోలు నుంచి ఉదయగిరికి బదిలీ చేశారు. 1884లో ఉదయగిరి బర్డిట్ దొర మిషన్ బంగ్లా పని ప్రారంభించారు. 1886లో పనులను పూర్తి చేశారు. అప్పట్నుంచి బర్డిట్ మెమోరియల్ చర్చి వాడుకలోకి వచ్చింది. ఇదేకాక పొదిలి, దొనకొండ, కావలి, ఒంగోలులో కూడా ఆయన చర్చిలు నిర్మించారు. అప్పట్నుంచి ఉదయగిరి బాప్టిస్టు చర్చికి అమెరికా, ఇండి యన్లు 20 మంది పాస్టర్లు పని చేశారు. అప్పట్లో 49 మంది బాప్టిస్టు పుచ్చుకొన్నారు. స్టేయిట్, బర్డిట్ దొరల కుమార్తె, కుమారుడుల సమాధులు సైతం చర్చిల ఆవరణలో ఉన్నాయి. ఈ చర్చికి ప్రస్తుతం పరిమి సుధీర్‌కుమార్ పాస్టర్‌గా పని చేస్తున్నారు.

● చర్చిల ముస్తాబు

బుధవారం క్రిస్మస్‌ను పురస్కరించుకొని బర్డిట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చితోపాటు మండలంలోని గండిపాళెం, అప్పసముద్రం, వెంగళరావు నగర్, గుడినరవ, కృష్ణంపల్లి, సర్వరాబాదు, అయ్యవారిపల్లి, పుల్లాయపల్లి, ఉదయగిరి, దాసరి పల్లి ఆర్లపడియ తదితర గ్రామాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పూలతో సుందరంగా తీర్చిదిద్దారు.

'ఉపాధి'కి ప్రత్యేక ప్రణాళిక..

● ఆ లక్ష్యంతోనే పని చేస్తున్నాం

15 శాతం వృద్ధిరేటు

- మెటీరియల్ కాంపోనెంట్‌తో సీసీ రోడ్ల నిర్మాణం
- 2029 నాటికి జిల్లా వృద్ధిరేటును పెంచుతాం
- ఇక సాగులో రైతులకు ఇబ్బందులు రానీయం
- ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం
- వివిధ శాఖలతో తనిఖీ బృందాల ఏర్పాటు
- కలెక్టర్ ఆనంద్ వెల్లడి



'గతేడాదితో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం పెరగడంతో ఎరువుల వినియోగం కూడా ఎక్కువైంది. గతేడాది డిసెంబరులో 9 వేల మెట్రిక్ టన్నుల యూరియాను వినియోగించగా ప్రస్తుతం ఇప్పటికే 12 వేల మెట్రిక్ టన్నుల వినియోగం జరిగింది. రానున్న జనవరిలో ఈ వినియోగం మరింత పెరగనుంది. ఇందుకు అనుగుణంగా యూరియా నిల్వలను అందుబాటులో ఉంచాం. అవసరం అని చెప్పగానే అక్కడకు యూరియాను పంపుతున్నాం. యూరియాను విక్రయించిన సమయంలో రైతుల బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. అప్పుడే ఎక్కడ ఎంత యూరియా వినియోగిస్తున్నారు. ఇంకా ఎంత అవసరమో తెలుస్తుంది. అయితే కొన్నిచోట్ల డీలర్లు ఈ బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేయకపోతుండటంతో జిల్లాలో యూరియా నిల్వలు ఉన్నట్లు రికార్డుల్లో కనిపిస్తోంది. ఈ కారణంగా జిల్లాకు యూరియా కేటాయింపుల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొందరు డీలర్లు అనధికారికంగా యూరియాను నిల్వ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. అలాగే అధిక ధరలకు విక్రయించడం, కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామంటూ కండీషన్లు పెడుతున్నట్లు కూడా మా దృష్టికి వచ్చింది. ఈ సమస్యలన్నీ పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖతోపాటు విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ వంటి ఇతర శాఖల అధికారులు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించేలా ఆలోచన చేస్తున్నాం. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో పలు దుకాణాల్లో డీవియేషన్లు గుర్తించాం. సుమారు రూ.కోటికిపైగా పెనాల్టీ కూడా విధించాం.

ప్రత్యేక ప్రణాళికతో 'ఉపాధి'

ఉపాధి హామీ పథకంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఈ ఏడాది ఎన్నికలు జరగడంతో ఆ సమయంలో కూలీల సంఖ్య కొంత తగ్గింది. అయితే జూలై నుంచి రోజువారీ కూలీల సంఖ్యను పెంచాం. గతేడాది 1.20 కోట్ల పనిదినాలు జరగ్గా ఈ ఏడాది కూడా అదే లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఇప్పటికే 80 లక్షల పనిదినాల వరకు పూర్తి చేశాం. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడంతో పనిదినాలు తగ్గాయి. కానీ ఫిబ్రవరి, మార్చి నెలల్లో రోజువారీ పనిదినాలు పెంచి లక్ష్యాన్ని చేరుకుంటాం. ఇప్పటి వరకూ జరిగిన పనిదినాల ఆధారంగా జనరేట్ అయిన మెటీరియల్ కాంపోనెంట్‌తో గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 150 కి.మీ పొడవున సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాం. ఇప్పటికే 50 కి.మీకుపైగా సీసీ రోడ్లు పూర్తయ్యాయి. కొన్ని చోట్ల గ్రావెల్ కొరత ఉందని పంచాయతీరాజ్ ఇంజనీర్లు చెప్పగానే ఇబ్బంది తొలగించాలని తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చాం. మార్చిలోపు ఈ రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తాం. వచ్చే ఏడాది 1.40 కోట్ల పనిదినాలను లక్ష్యంగా పెట్టుకుంటాం. తద్వారా వచ్చే మెటీరియల్ కాంపోనెంట్‌తో రానున్న ఏడాదిలో మరిన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతాం.

15 శాతం వృద్ధిరేటు లక్ష్యం

ప్రభుత్వ ఆలోచన ప్రకారం స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించాం. అభివృద్ధికి ఏ శాఖలో ఎటువంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై డాక్యుమెంట్ తయారు చేశాం. అందుకు అనుగుణంగా 2029 నాటికి జిల్లా వృద్ధిరేటును 15 శాతం పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రస్తుత జీడీడీపీ రూ.61,664 కోట్ల నుంచి రూ.1,31,180 కోట్లకు చేరే విధంగా ముందుకెళుతున్నాం. రానున్న ఐదేళ్లలో 73,116 హెక్టార్ల భూమిని సాగులోకి తీసుకొచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. పప్పు పంటల విస్తీర్ణాన్ని 12,740 హెక్టార్ల నుంచి 22,499 హెక్టార్లకు పెంచేందుకు ప్రణాళిక రూపొందించాం. మెగా, మైక్రో, స్మాల్ ఇండస్ట్రియల్ సంఖ్యను 11,992 నుంచి 24,004కు పెంచడం, అలానే పోర్ట్ ఆధారిత పరిశ్రమల కోసం భూ బ్యాంక్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాం. వంద శాతం అక్షరాస్యత లక్ష్యంతో రానున్న ఏడాది కాలంలో 1.50 లక్షల మందికి శిక్షణ ఇవ్వనున్నాం' అని కలెక్టర్ ఆనంద్ వెల్లడించారు.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

యూరియా కొరత లేకుండా చూడండి

● మంత్రి, కమిషనర్‌ను కోరిన సోమిరెడ్డి

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ ఏడాది రబీ సాగు విస్తీర్ణం పెరిగిందని, యూరియా కొరత లేకుండా చూడాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం అమరావతిలో వారిని కలిసి యూరియా అవసరాలపై చర్చించారు. ప్రస్తుతం 15 వేల టన్నుల యూరియా జిల్లాకు అవసర ముందని, తక్షణమే సరఫరా అయ్యేలా చూడాలని కోరారు. తన విజ్ఞప్తికి మంత్రి, కమిషనర్ సానుకూలంగా స్పందించారని, యూరియా సరఫరాకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సోమిరెడ్డి తెలిపారు.

టెన్త్ ఫీజు చెల్లింపునకు 'తత్కాల్'

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి) : వచ్చే మార్చిలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఇప్పటి వరకు ఫీజు చెల్లించని విద్యార్థులు తత్కాల్ పథకం కింద ఈనెల 27 నుంచి జనవరి 10వతేదీ లోపల ఫీజు చెల్లించవచ్చని డీఈవో డాక్టర్ బాలాజీరావు ఓ ప్రక టనలో తెలిపారు. జిల్లాలోని జనరల్, ప్రైవేట్ విద్యార్థులు 'తత్కాల్' కింద రూ.వెయ్యి అపరాధ రుసుముతో ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చన్నారు.


ఎస్సీ, ఎస్టీలకు సౌర విద్యుత్

- 'ఉచితం' స్థానంలో ఏర్పాటుకు కసరత్తు
- కాలనీల్లో అధికారుల సర్వే
- వినియోగదారుల నమోదు ప్రారంభం

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత విద్యుత్ పొందుతున్న ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు సౌర విద్యుత్ సౌకర్యం కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిపై అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది.

'ఉచితం' భారం తగ్గేలా...

నిరుపేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తూ వస్తోంది. జిల్లాలో దాదాపుగా 2లక్షలకు పైగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు ఉండగా, అందులో 200 యూని ట్లలోపు వాడకం కలిగినవి 1.25లక్షలు ఉన్నాయి. వారందరికీ ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోంది. అయితే సోలార్ విద్యుత్తు అందుబాటులో ఉండడం, దీనికి కేంద్ర ప్రభుత్వం కొంతమేర సబ్సిడీ ఇస్తుండటంతో 'ఉచితం' లబ్ధిదారులకు సౌర విద్యుత్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం యోచిస్తోంది. సోలార్ కరెంటును ప్రోత్సహించడమేకాక ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వంపై పడుతున్న భారాన్ని తగ్గించేందుకు ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు సౌరవిద్యుత్ ఏర్పాటు చేసుకునేలా చూడాలని విద్యుత్‌శాఖను ఆదేశించింది.



బ్యాంకు రుణాల ద్వారా...

సాధారణంగా 200 యూనిట్ల విద్యుత్ వాడకానికి 2 కిలో వాట్ల సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి రూ.1.80లక్షలు ఖర్చవుతుండగా అందులో రూ.50వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తోంది. మిగతా సొమ్మును బ్యాంకుల ద్వారా వినియోగదారుడికి రుణం రూపంలో అందించి ఆ మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో నెలవారీ ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం కంటే సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు అయ్యే ఖర్చు ఇబ్బందికరం కాదని అధికారులు చెబుతున్నారు. ఇందుకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ వినియోగదా రుల రిజిస్ట్రేషన్ చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అధికారులు సర్వే చేస్తూ వినియోగదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఇళ్లపైనే సోలార్ పలకలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, కాలనీల్లో చిన్న ఇళ్లకు ఆ అవకాశం లేకపోతే ఎవరికీ ఇబ్బందిలేని ఖాళీస్థలాల్లో సోలార్ పలకలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు.



బాగున్న రహదారిని పాడు చేశారు..!

ఉదయగిరి మండలంలోని గుడినరవ గ్రామ రహదారి వైసీపీ ప్రభుత్వ నిర్వాహ కంతో బురద మయంగా మారింది. దీంతో గ్రామ స్థులకు అవస్థలు తప్పడంలేదు. గత వైసీపీ ప్రభు త్వంలో ప్రధాన రహదారి నుంచి గ్రామం లోని పాఠశాల వరకు సిమెంట్‌రోడ్డు మంజూ రైంది. కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణానికి ఎక్స్‌కవేటర్‌తో బాగున్న రహదారి ధ్వంసం చేశాడు. అనంతరం చోటుచేసుకొన్న పరిణామాలతో ఆ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. అప్పటి నుంచి ఆ రోడ్డు చిరు జల్లులకే బురదమయంగా మారుతోంది. రహదారికి మరమ్మతులు చేపట్టాలని పాలకులకు, అధికారులకు గ్రామస్థులు మొరపెట్టుకున్నా ఎవరూ స్పందించ లేదు. కూటమి ప్రభుత్వమైనా సిమెంట్‌రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

కేతిగుంట సర్పంచి చెక్‌పవర్ రద్దు

మర్రిపాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని కేతిగుంట సర్పంచి నాగేళ్ల హరితేజ చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ మంగళవారం జిల్లా పంచాయితీ అధికారి శ్రీధర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల వార్డు మెంబర్లు, గ్రామస్థుల ఫిర్యాదుతో అధికారులు పంచాయతీలో విచారించారు. గ్రామంలో జరిగిన పనుల వివరాల రికార్డులు తీసుకొని విచారణ చేపట్టారు. సాధారణ నిధుల్లో రూ.2,121,50లకు సరైన ఓచర్లు లేవని, పనులకు సంబంధించి పంచాయతీ తీర్మానాలు కూడా చేయలేదని, ఆ మొత్తం నగదును తన సొంత ఖాతాకు సర్పంచి బదిలీ చేసుకున్నట్లు అధి కారులు గుర్తించారు. కేతిగుంట గ్రామంలో అవినీతి నిర్ధారణ అయినట్లు గుర్తించి మంగళవారం నుంచి మూడు నెలలపాటు సర్పంచి చెక్‌పవర్‌ను నిలుపుదల చేయాలని, తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకు 14, 15వ ఆర్థిక సంఘా నిధులను డ్రా చేయకుండా చూడాలని ఎంపీడీవోను డీపీవో ఆదేశించారు. సర్పంచి 15రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ముగ్గురమ్మల తిరునాళ్ల రానుందోచ్..

మండలకేంద్రంలో వెలసిన గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మల తిరునాళ్ల ఈ నెల 31న అత్యంత వైభవంగా జరగనుంది. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి నేతృత్వం.. గ్రామపెద్దల సమక్షంలో మంగళవారం సాయంత్రం ఉత్సవాల రెండో చాటింపును నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దకాపు నలగట్ల మహేష్, పెద్దగొల్ల మేక సుబ్బయ్య, పెద్దమాదిగ బ్రహ్మయ్యలతో పాటు అన్నివర్గాల పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడారు. ముగ్గురమ్మల తిరునాళను గ్రామ ఆచార, సంప్రదాయాలకు అనుగుణంగా చేపడతామన్నారు. వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేపడతామన్నారు. కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, వప్పు సుధాకర్, బ్రహ్మానందరావు, కత్తుల కిరణ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)

ఈ బస్‌షెల్టర్‌ను వినియోగించరా...?



సున్నంవారిచింతల వద్ద నిరుపయోగంగా బస్‌షెల్టర్

ప్రయాణికుల సౌకర్యార్థం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బస్‌షెల్టర్లు గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలోని మాసాయిపేట, సున్నంవారిచింతల, గుడినరవ, వెంగళరావునగర్ తదితర గ్రామాల్లో నిర్మించిన బస్‌షెల్టర్లలో ప్రజలు కాసేపు సేద తీరేందుకు కూడా వీలులేదు. కొన్ని శిథిలావస్థకు చేరుకోగా, మరికొన్ని కంపచెట్ల మధ్య విషపురుగులకు నిలయాలుగా మారాయి. మందుబాబులు వీటిని అడ్డాగా మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో కురుస్తున్న వర్షాల పుణ్యమాని రహదారులపై నిల్చోలేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ బస్‌షెల్టర్లను వినియోగంలోకి తీసుకురావాలి.

- ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)



మాతాశిశు మరణాలపై సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

మాతాశిశు మరణాలు అరికట్టాలి

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మాతా, శిశు మరణాలు జరగకుండా చూడాలని కలెక్టర్ ఆనంద్ వైద్య ఆరోగ్యశాఖను హెచ్చరించారు. గత మూడు నెలల్లో జిల్లాలో సంభవించిన మాతృ మరణాలపై మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. నెల్లూరులోని మూలాపేటకు చెందిన మాధవి, కోవూరుకు చెందిన మునిరత్నమ్మ ప్రసవ సమయంలో మరణానికి కారణాలేమిటని ఆయా పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్‌ఎం, ఆశాలను ప్రశ్నించారు. ఆరోగ్య సిబ్బంది వల్ల మాతా, శిశువులు మరణిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ వైద్య సేవ పథకం సదుపాయం ఉన్నప్పటికీ మాధవిని అడ్మిట్ చేసుకోకుండా జీజీహెచ్‌కు సిఫార్సు చేసిన ప్రైవేట్ వైద్యశాల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరపాలని 'వైద్యసేవ' జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్ కుమార్‌ను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాతకు సూచించారు. హైరిస్క్ గర్భవతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, జీజీహెచ్ గైనకాలజిస్టులు, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం)(ఆంధ్రజ్యోతి) : బాంకర్లు రుణా లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల వ్యాపార అవసరాల కోసం వారి ఖాతాలను పీఎంఈజీపీ కింద బ్యాంకులకు అనుసంధానం చేయాలని ఆదేశించారు. రైతులకు పంట రుణాలు ఇచ్చేవరకు సరైన పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీకాంత్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు ఆక్రమించారు.. న్యాయం చేయండి

- వర్షంలోనే తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళ బైఠాయింపు



తహసీల్దారు కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళ

కలువాయి, డిసెంబరు 24 : నా ఇల్లు ఆక్రమించారు.. న్యాయం చేయండి... అంటూ కలువాయిలో మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట వర్షంలోనే ఓ మహిళ బైఠాయించి నిరసన తెలిపారు. స్థానిక దళితకాలనీకి చెందిన కోడికూతల నాగమణి తన ఇల్లు తనకు ఇప్పించేంత వరకు ఇక్కడ నుంచి కదలనంటూ నినాదాలు చేశారు. బాధితురాలి కథనం మేరకు వివరాలు... 2008లో ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం కింద కలువాయి దళితకాలనీలో ఇళ్లు నిర్మించారు. నాలుగేళ్ల ఆ ఇంటో కాపురం ఉండి, ఆ తరువాత బతుకుతెరువు కోసం నాగమణి నెల్లూరు వెళ్లారు. ఆ సమయంలో ఆమె ఇంటిని ఆమె కుటుంబ సభ్యులు ఆక్రమించారు. ఈ క్రమంలో రెవెన్యూ సిబ్బంది లంచాలు తీసుకుని ఇల్లు ఆక్రమించిన వారికే అనుకూలంగా రాయించారని ఆమె ఆరోపించారు. తహసీల్దారు స్పందించి తన ఇల్లు తనకు ఇప్పించాలని ఆమె డిమాండ్ చేశారు. మరోసారి పరిశీలించి, న్యాయం చేస్తామని రెవెన్యూ సిబ్బంది హామీ ఇవ్వడంతో ఆమె నిరసన విరమించారు. ఈ విషయమై తహసీల్దారు శ్యామ్‌సుందరరాజు మాట్లాడుతూ నాగమణి తనకు ఇచ్చిన పొజిషన్ సర్టిఫికెట్ ప్రకారం సర్వే నంబరు 396లోని ఇల్లు చూపించాలని, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ పెట్టుకుందని తెలిపారు. సర్వేయర్‌తో విచారించి, ఆయన ఇచ్చిన నివేదిక ప్రకారమే ఎండార్స్‌మెంట్ ఇచ్చామని తెలిపారు. ఈ విషయం పంచాయతీ అధికారులకు సంబంధించినదని ఆయన పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	109
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7294
వెండి కిలో ధర	రూ. 89,900
వెండి ఒక గ్రాము	రూ.92.90

18 మద్యం సీసాల స్వాధీనం

ఏఎస్‌పేట, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ సైదులు తెలిపారు. అనుమసముద్రంలోని వినాయక సెంటర్ వద్ద తనిఖీలు చేస్తుండగా పెద్దబ్బీపురం గ్రామానికి చెందిన వ్యక్తి 18 మద్యం సీసాలు కలిగి ఉండటాన్ని గమనించి, స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.

100% హాజరుంటేనే జీతం

- సచివాలయ ఉద్యోగుల 'బయోమెట్రిక్'లో మార్పు
- ఎవరికీ మినహాయింపు లేదు
- మధ్యాహ్నం 3 గంటల హాజరు ఎత్తివేత
- మెరుగైన పాలన కోసం ప్రభుత్వ నిర్ణయం



నెల్లూరు(సిటీ), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హాజరుకు సంబంధించిన బయోమెట్రిక్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసింది. ప్రజలకు మెరుగైన పాలన అందించడం, ఉద్యోగుల్లో జవాబుదారీ తనం పెంచే ఉద్దేశంతో వారి జీతానికి, హాజరుకు లంకె పెడుతూ కఠిన నిర్ణయాలు తీసుకుంది. నూరు శాతం హాజరు ఉంటేనే పూర్తి జీతం ఇవ్వాలని, హాజరు నుంచి ఏ ఒక్కరికీ మినహాయింపు లేదని స్పష్టం చేస్తూ డీడీవోలకు ఆదేశాలు జారీ చేసింది.

గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రారంభించింది. 750 నుంచి 1300 కుటుంబాల పరిధిలో వివిధ విభాగాలకు చెందిన 10 మంది కార్యదర్శులతో ఒక సచివాలయం ఏర్పాటు చేసింది. ప్రజలు, ప్రభుత్వా నికి వారధిగా సచివాలయాలు పనిచేసేలా రూపకల్పన చేసింది. అయితే సచివాలయాల్లో పాలన, జవాబుదారీతనం గాడితప్పినట్లు గుర్తించిన ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తొలుత ఉద్యోగుల హాజరుపై దృష్టి సారించింది. ఉదయం 10.30 లోపు, మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 5 గంటల తరువాత బయో మెట్రిక్ హాజరు వేయాలని కొంతకాలం క్రితం నిబంధనలు విధిం చింది. అయితే అవి పూర్తిగా అమలు కావడం లేదు. ఉదయం పూట హాజరు వేయగానే ఆరోజు మొత్తానికి హాజరు వేసినట్లు సాంకేతిక పరిక రాల్లో నమోదవుతోంది. దీనికితోడు వీఆర్వోలు, పంచాయతీ, ఆరోగ్య కార్యదర్శులు, అడ్మిన్లు, ఎనర్జీ సెక్రటరీలు హాజరు నుంచి మినహాయింపు పొందుతు న్నారు. ఈ క్రమంలో హాజరుతో సంబంధం లేకుండా ఉద్యోగులకు పూర్తి జీతాలు చెల్లిస్తు న్నారు. అయితే సచివాలయాల్లో పలువురు ఉద్యోగులు అందుబాటులో ఉండ టం లేదని, ప్రజలకు సేవలు కూడా సక్రమంగా అందడం లేదని ఆకస్మిక తనిఖీలకు వెళ్లిన ప్రత్యేక అధికారులు తేల్చారు. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది.

కఠినతరం

సచివాలయ కార్యదర్శుల బయోమెట్రిక్ హాజరును ప్రభుత్వం కఠినతరం చేసింది. ఇప్పటి వరకు మూడు పూట్ల వేస్తున్న హాజరులో మధ్యాహ్నం 3 గంటల నమోదును సడలించింది. అయితే ఉదయం, సాయంత్రం నిర్ణీత కాల వ్యవధిలోపు బయో హాజరు వేస్తేనే ఆరోజుకు పూర్తి హాజరైనట్లు తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. నెలంతటిలో పూర్తి స్థాయి హాజరు నమోదు చేస్తేనే పూర్తి జీతం చెల్లించాలని ఆదేశించింది. అంతేకాకుండా బయోమెట్రిక్ హాజరు సాంకేతిక వేగాన్ని కూడా పెంచింది. క్షణాల్లో హాజరు నమోదైయ్యే విధంగా పరికరం పనితీరును మెరుగుపరిచింది. సెలవుపై వెళ్లాలనుకునే ఉద్యోగులు సదరు డీడీవో వద్ద ముందస్తు అనుమతి తీసుకోవాలని, లేకుంటే నూరు శాతం హాజరుకు చేరుకోని విధంగా సాంకేతికతను రూపొందించింది. దీనికి తోడు సచివాలయ ఉద్యోగులు ఎవరికీ హాజరు నుంచి మినహాయింపు లేకుండా ఉత్తర్వులిచ్చింది.

మోసగాడిపై కేసు

నెల్లూరు(క్రైం, ఆంధ్రజ్యోతి) : మహిళతో నమ్మకం గా ఉంటూ వంచించిన వ్యక్తిపై చిన్న బజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని ఖుద్దూస్‌నగర్‌కు చెందిన ఓ మహిళకు భర్త నుంచి విడాకులు తీసుకుని ఒంటరిగా జీవిస్తోంది. ఆమెకు ఫయాజ్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తాను కూడా భార్య నుంచి విడిపోయి ఒంటరిగా ఉంటున్నానని నమ్మించాడు. దీంతో ఇద్దరు సహజీవనం చేస్తున్నారు. రెండు నెలల క్రితం మహిళ వద్దనున్న రూ.3 లక్షలను ఫయాజ్ తీసుకున్నాడు. ఆ తర్వాత నుంచి కనిపించడం లేదు. బాధితురాలు ఆరా తీయగా ఫయాజ్ తన భార్యతో కలిసి ఉంటున్నాడని తెలిసింది. దీంతో తనను మోసగించాడని చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ అయ్యప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అమిత్ షాను బర్తరఫ్ చేయాలి : కాంగ్రెస్

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై రాష్ట్రపతి చర్యలు తీసుకుని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఆర్వో ఉదయ భాస్కర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏటూరి శ్రీనివాసులు రెడ్డి, సంజయ్‌కుమార్, మల్లికార్జున రెడ్డి, శ్రీరాములు, అల్లాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల భవనాల పూర్తికి కృషి

- ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు షరీఫ్



మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న షరీఫ్

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏపీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల భవన నిర్మాణాలు పూర్తి చేయించ డానికి కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్ తెలిపారు. మంగళవారం అక్కచెరువు పాడులో ఉన్న మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న పాఠ శాల వసతి గృహాన్ని, ఉపాధ్యాయుల నివాస గృహాలు, విద్యార్థుల భోజనశాలను పరిశీలించారు. తరగతి గదుల్లోని విద్యార్థులతో మాట్లాడి సమస్యలేమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఈ పాఠశాల భవన నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అయితే అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం పాఠశాల నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. ఈ పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు ఒక్కొక్క తరగతికి 80 మంది విద్యార్థులను చేర్చుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. పాఠశాలలో అన్నీ వసతులు కల్పించి పూర్తి స్థాయిలో విద్యార్థులను చేర్చుకునేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

32 వేల ఎకరాల వక్ఫ్ భూములు అన్యాక్రాంతం

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వక్ఫ్ బోర్డును గత ఆరు సంవత్సరాలుగా నిర్వీర్యం చేశారని, 67 వేల ఎకరాలకుగాను 32 వేల ఎకరాల వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని షరీఫ్ ఆరోపించారు. మిగిలిన భూములను జీయో ట్యాగింగ్ చేసి సంపద సృష్టించే చర్యలు తీసుకుంటామని తెలియచేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో మైనార్టీల కోసం ప్రత్యేక పథకాలు తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనార్టీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల ద్వారా జిల్లాకు రూ.29 కోట్లు అందిస్తామని ప్రకటించారు. బాలుర రెసిడెన్షియల్ పాఠశాల కోసం టీడీపీ గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో 11 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తే మాజీ మంత్రి అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులు ఆ స్థలంపై కోర్టులో స్టే తీసుకు వచ్చారన్నారు. బాలుర రెసిడెన్షియల్ కోసం వేరే స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను పరిశ్రమలు, వ్యాపారానికి 33 ఏళ్ల లీజుకు ఇచ్చే ఆలోచన ఉందన్నారు. సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్య దర్శి చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు జాఫర్ షరీఫ్, మైనుద్దీన్, సాబీర్‌ఖాన్, నన్నే సాహెబ్, రియాజ్, మైజుల్లా హుస్సేని తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు హక్కులపై అవగాహన అవసరం : జేసీ



మాట్లాడున్న జేసీ కార్తీక్, పక్కన జింకారెడ్డి శేఖర్, డీఎస్వో వెంకట రమణ

నెల్లూరు (హరనాథపురం) డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) వినియోగదారులకు వారి హక్కులపై అవగాహన అవసరమని జేసీ కార్తీక్ అన్నారు. మంగళవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న డిజిటల్ కొనుగోళ్లలో వినియోగదారులు మోస పోకుండా ఉండాలన్నారు. వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ జిల్లా అధ్యక్షుడు జింకారెడ్డి శేఖర్ మాట్లాడుతూ వినియోగదారులకు సేవాలోపం జరిగితే కేసు వేయవచ్చనే అవగాహన ముఖ్యమన్నారు. ఈ సమావేశంలో డీఎస్వో వెంకటరమణ, జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, ఆహార భద్రత అసిస్టెంట్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, తూనికలు కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ ఐజాక్ పాల్గొన్నారు.

- వినియోగదారుల హక్కులు, బాధ్యతల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని ఆర్‌ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు సూచించారు. నెల్లూరులోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన వినియోగదారుల హక్కుల సదస్సులో ఆయన ప్రసంగించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 2,415 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలి పారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 72.0 94 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 1,200, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలు వకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నా మని తెలిపారు.

- కండలేరులో...

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తి సామ ర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటిమట్టం 56.9 టీఎంసీలుగా ఉందని జలాశయం ఏఈ కట్టా తిరుమల య్య ఒక ప్రకటనలో తెలిపారు. టోటల్ ఇన్‌ఫ్లో 1350 క్యూసెక్కులు కాగా, వివిధ కాలువల ద్వారా ఔట్‌ఫ్లో 745 క్యూసెక్కులుగా ఉందని ఆయన తెలిపారు.

మూడో అంతస్తు పైనుంచి పడి వివాహిత మృతి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్‌లో ప్రమాదవశాత్తు మూడవ అంతస్తు నుంచి కాలు జారి కిందపడి మహిళ మృతి చెందింది. పోలీసుల సమాచారం మేరకు.. వేణుగోపాల్, లక్ష్మీదేవి (41) దంపతులు రాజీవ్‌గృహకల్ప అపార్ట్ మెంట్‌లో నివసిస్తున్నారు. వారికి ఇద్దరు సంతానం. వేణుగోపాల్ అనారోగ్యంతో ఇంటివద్దనే ఉంటుండగా, లక్ష్మీదేవి మాగుంట లేఅవుట్‌లోని ఓ ప్రముఖ వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. మంగళవారం ఆమె అపార్ట్‌మెంట్‌లోని మూడవ అంతస్తు నుంచి చెత్తను కిందకు వేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యుల సమాచారంతో అక్కడికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది లక్ష్మీదేవిని పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. భర్త వేణుగోపాల్ ఫిర్యాదుతో చిన్నబజారు స్టేషన్ ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

పీఏసీఎస్ ఎన్నికలపై సమీక్ష

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ క్రెడిట్ సొసైటీ(పీఏసీఎస్)ల ఎన్నికలపై ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సమీక్షించారు. నెల్లూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరు, ఉదయగిరి, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. సొసైటీ ఎన్నికల్లో పార్టీ నాయకులు అనుసరించాల్సిన అంశాలను సూచించారు. కార్యక్రమంలో నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కోడూరు తీరంలో అలల అలజడి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలోని కోడూరు సముద్ర తీర ప్రాంతాలలో పరిస్థితులు అల్లకల్లోలంగా మరాయి. సముద్రపు అలలు కూడా ముందుకు దూసుకువస్తున్నాయి. ఈ నేపథ్యంలో తీర ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది. దీంతో ఆ ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పుడే పరిస్థితులు ఇంత భయా నకంగా ఉంటే తుపాను ముప్పు వస్తే ఇంకెలా ఉండబోతుందోనని తీర ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. వాయుగుండం ప్రభావంతో పట్టపగలే చీకట్లు కమ్ముకున్నాయి. తీర ప్రాంతంలో చలికి చిన్నారులు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు వణికిపోతున్నారు.



- తోటపల్లిగూడూరు,(ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

క్రీస్తు రాక కోసం చర్చిల ముస్తాబు

● వాడవాడలా క్రిస్మస్ కాంతులు

● వేడుకలకు సిద్ధమైన క్రైస్తవులు

ఆత్మకూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్‌ను పురస్కరించుకుని నియోజకవర్గంలోని చర్చిలు క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు సంఘకాపరులు, పెద్దలు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని క్రిస్టియన్‌పేట సెంటినరీ తెలుగుబాప్టిస్టు చర్చి, సెంటల్ తెలుగు బాప్టిస్టు చర్చి, సియోన్ ప్రార్థనమందిరాల్లో క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేసి, చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వెన్నవాడ, కరటంపాడు, వెంకట్రావుపల్లి, బీ.చిరువెళ్లలో ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు షకీల, సుప్రజ మాట్లాడారు. ఏసుక్రీస్తు జననం, ఆయన లోకరక్షకుడిగా మారిన విశేషాలను విద్యార్థులకు వివరించారు.

● సంగం: వంగల్లు, దువ్వూరు, మక్తాపురం, అన్నారెడ్డిపాళెం, తరుణవాయి, మర్రిపాడు, సంగం గ్రామాల్లోని చర్చిలు ముస్తాబు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రైస్తవులు ఆనవాయితీ ప్రకారం చర్చిల ముందు, ఇళ్ల ముంగిట్లో స్టార్‌లను ఎగురవేశారు.

● ఉదయగిరి: అన్ని గ్రామాల చర్చిలకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అందజేసిన మిఠాయిల బాక్సులను మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి చర్చి నిర్వాహకులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ బుధవారం బర్డిట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నరసింహులు, నల్లిపోగు రాజా, ఖాన్‌సా పాల్గొన్నారు.

● సీతారామపురం: సీతారామపురం హరిజనవాడ, సింగారెడ్డిపల్లి, బసినేనిపల్లి, మారంరెడ్డిపల్లి, సోంపల్లి, గుండుపల్లిలో విద్యుత్ దీపాలతో అలంకరించారు.

● వింజమూరు: మానవ జీవితంలో ప్రతి ఒక్కరూ ఐక్యత, ప్రేమ, దయతో నిజాయతీగా జీవించడమే క్రీస్తు బోధనల సారాంశమని విశ్రాంతి డీఎంహెచ్‌వో డాక్టర్ కే మాశిలామణి పేర్కొన్నారు. మంగళ వారం కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ ప్రాంగణంలో నియోజక వర్గంలోని చర్చిలకు స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లా డుతూ కాకర్ల ట్రస్ట్ సభ్యులు మూడేళ్ల నుంచి నియోజ కవర్గంలోని ప్రతి చర్చికి స్వీట్లు పంచే కార్యక్రమంలో తాను భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం డాక్టర్ మాశిలామణిని మహేష్, మధురెడ్డి, శాలువాతో సత్కరించి స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు.

● కావలి టౌన్: పట్టణంలోని చర్చీల్లో ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యాయి. ఏరియా వైద్యశాల వెనుక ఉన్న తెలుగు బాప్టిస్ట్ చర్చీ, కచ్చేరిమిట్ట ది తెలుగు బాప్టిస్ట్ చర్చి, సొసైటీ కాలనీలోని సత్యసువార్తిక మందిరం, హేరోబు ప్రార్థనా మందిరం, తుఫాన్‌నగర్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలంకరణలో మెరిసిపోతు న్నాయి. రాత్రిపూట చర్చీల్లో ప్రార్థన, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

● కలిగిరి: మండలకేంద్రంతో పాటు నాగసముద్రం, తెల్లపాడు, పెదకొండూరు చర్చీలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పాస్టర్ల ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం పేదలకు బట్టలు పంపిణీ చేయనున్నట్లు క్రైస్తవసోదరులు తెలిపారు.

● కావలి టౌన్: స్థానిక కో ఆపరేటివ్ కాలనీలోని నలందా పాఠశాలలో ప్రీక్రి స్మస్ వేడుకలు అలరించాయి. పాఠశాల డైరెక్టర్ ఎండీ.వసీం పర్యవేక్ష ణలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా రెవరెండ్ జయపాల్ పాల్గొన్నారు. వసీం, జయపాల్‌లు చిన్నా రులతో కలిసి కేక్ కట్‌చేసి తినిపించారు. జయపాల్ మాట్లాడుతూ త్యాగానికి ప్రేమకు క్రీస్తు ప్రతిరూపమని, ప్రతిఒక్కరూ కష్టాల్లోని పేదలకు సాయం చేయాలన్నారు. చిన్నారుల వేషాధారణలో అలరించారు.

● కందుకూరు:నియోజక వర్గంలోని క్రైస్తవ సోదర సోదరీమణులకు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు తూమాటి మాధవ రావు, కంచర్ల శ్రీకాంత్ చౌదరి, మాజీఎ మ్మెల్యేలు మానుగుంట మహీధర రెడ్డి శు భాకాంక్షలు తెలిపారు. అనం తరం పామూరురోడ్డులోని బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో క్రి స్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల ఛైర్మన్ ఉన్నం బాస్కరరావు పాల్గొన్నారు. నాగార్జున పబ్లిక్ స్కూల్‌లో ముందస్తు వేడుకలు నిర్వహించారు.

● వలేటివారిపాలెం: శింగమనేనిపల్లె ఎస్సీ కాలనీ నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మట్లూరి నతానియేలు, అత్తోటి వెంకటేశ్వర్లు, బత్తిన మాల్యాద్రి, గోచిపాతల మెషే, కసుకుర్తి నవ రత్నం, దువ్వూరి రమేష్, గౌడపేరు ప్రసాద్‌రావు, గౌడ పేరు అనీల్‌బాబు, కట్టా శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే కొండసముద్రం-2 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వ హించిన సెమీ క్రిస్మస్ వేడుకలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సునీత పాల్గొన్నారు. శిరీషా, శిరోమణి పాల్గొన్నారు.



సంగం మండలం వంగల్లులో ముస్తాబైన చర్చి



కావలి: విద్యుత్ దీపాలంకరణలో మెరిసిపోతున్న తెలుగు బాప్టిస్టు చర్చి



కందుకూరు: ఆక్స్‌ఫర్డ్ చిన్నారుల సంబరం



కావలి: నలందా పాఠశాల వేడుకల్లో చిన్నారులు



ఆత్మకూరు : ప్రీ క్రిస్మస్ వేడుకల్లో అలరించిన అంగన్‌వాడీ చిన్నారులు



ఉదయగిరి : చర్చి నిర్వాహకులకు మిఠాయిలు అందజేస్తున్న మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న



సీతారమపురం: ముస్తాబైన సీతారామపురం చర్చి

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● లలిత, మండల వ్యవసాయ అధికారి



ఇంటర్వ్యూ...

కావలి రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):రైతు సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యంగా రైతులకు సొసైటీలు, రైతుసేవా కేంద్రాలతో ఎరవులు, పురుగు మందులు ఎమ్మార్పీ ధరలకు అందిస్తున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి లలిత తెలిపారు.

? మండలంలో ఎన్ని ఎకరాల్లో వరి సాగు లోకి తెచ్చారు.

! మండలంలో ఇప్పటివరకు 6వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. మరో 8వేల ఎకరాల్లో వరినాట్లు వేసేందుకు అవకాశం ఉంది.

? యూరియా కొరత ఉందా.

! సొసైటీల ద్వారా ఎరువుల సరఫరాకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిచ్చింది. అలాగే రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా ఎమ్మార్పీ ధరలకు ఎరువుల అమ్ముతున్నారు. కొత్తగా సర్వాయపాలెం, మునునూరు లో సొసైటీల ను అందుబాటులోకి వచ్చాయి.

? ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పిస్తున్నారా.

! వారంలో ప్రతి మంగళ, బుధవారం 4 గ్రామాల చొప్పున వ్యవసాయ, ఉద్యానవన శాఖ, ఇతర అనుబంధ సంఘాలను కలుపుకుని ఎరువులు, పురుగు మందుల వాడకం, లాభసాటి వ్యవసాయంపై అవగాన కల్పిస్తున్నాం.

జేవీవీ కార్యవర్గ సమావేశం

కావలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ జనవిజ్ఞానవేదిక నూతన కార్యవర్గ సమావేశం మంగళవారం ఉదయం స్థానిక రవి నర్సింగ్‌హోమ్‌లో వేదిక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. తొలుత దాదాసాహెబ్ అవార్డుగ్రహీత ప్రముఖ దర్శకులు శ్యామ్‌బెనగల్, తబలా విద్వాంసులు జాకీర్ హుస్సేన్ మృతికి నిమిషం సంతాపం ప్రకటించారు. అనంతరం జేవీవీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ప్రముఖ వైద్యులు, జేవీవీ గౌరవాధ్యక్షుడు బెజవాడ రవికుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బెజవాడ రవికుమార్, జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు జేవీవీ బాధ్యులు గాదిరెడ్డి హరినాథ్, సుబ్బరాయశర్మ, పాపిశెట్టి జానకి రాం, కల్యాణి, హరినారపరెడ్డి, కందికట్టు నారాయణ, శారద, జమున, చలపతి రావు, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

మెషీన్ లెర్నింగ్‌లో వాస్తవిక పరిజ్ఞానం తెలుసుకోవాలి

కావలి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): యువ ఇంజనీర్లు మెషిన్ లెర్నింగ్‌లో వాస్తవిక పరిజ్ఞానాన్ని తెలుసుకోవాలని టీసీఎస్ ఇంజనీర్ మహేంద్ర రెడ్డి తెలిపారు. మంగళవారం విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సదస్సులో మహేంద్ర రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భవిష్యత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సి ఇంజనీరింగ్ ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. సదస్సుకు అధ్యక్షతన వహించిన ఏఐ విభాగాధిపత్రి మహేశ్వర రెడ్డి మాట్లాడారు. ఇలాంటి సంకేతిక సదస్సులతో విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శేషయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్ ప్రిన్సిపాల్‌గా షేక్ నాగూర్‌వలి

కందుకూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా షేక్ నాగూర్‌వలి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉర్దూ అధ్యాపకుడిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడ ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. ఇంతవరకు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ అధ్యాపకుడు ఓరుగంటి వెంకటేశ్వరరావు నాగూర్‌వలికి బాధ్యతలు అప్పగించారు.

సమీకృత వ్యవసాయంపై అవగాహన

కలువాయి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వెంకటరెడ్డిపల్లిలో డీఆర్‌డీఏ వెలుగు అధికారులు మంగళవారం మహిళా రైతులకు సమీకృత వ్యవసాయ పద్ధతులపై అవగాహన నిర్వహించారు. డీఆర్‌డీఏ ఏపీవో భానుప్రకాష్, ఏవో వీ ప్రతాప్, వెలుగు ఏపీఎం రవి, ఏరియా కోర్డినేటర్లు కిరణ్, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

● బండగానిపల్లిలో..

ఉదయగిరి: బండగానిపల్లి పంచాయతీ బిజ్జంపల్లి, లింగంనేనిపల్లి, కృష్ణారె డ్డిపల్లిల్లో పంచాయతీ సిబ్బంది పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. తాగునీటి పథకాలు, చేతిపంపులు, మురికినీటి కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

సంగ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. విద్యార్థినులకు జ్వరాలు ఎక్కువగా ఉండడంతో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి సూచనల మేరకు పంచాయతీ సిబ్బంది దోమల నివారణ మందు పిచికారీ చేశారు. తరగతి గదులు, డార్మెంటరీ, డ్రైనేజీ, మరుగుదొడ్ల పరిసర ప్రాంతాల్లో ఈ మందు స్ప్రే చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమతి, సబ్ యూనిట్ ఆఫీసర్ ఖాదర్‌బాషా, పంచాయతీ కార్యదర్శి నరసయ్య, వైద్యఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



లింగసముద్రం: మాట్లాడుతున్న తహసీల్దారు సీతామహాలక్ష్మి

లింగసముద్రం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సీతామహాలక్ష్మి తెలిపారు. మంగళవారం తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెంలో నిర్వహించిన సదస్సులో పాల్గొని రైతుల నుంచి భూ సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో లింగసముద్రం నీటి సంఘం అధ్యక్షులు పొలిమేర చిననాగిరెడ్డి, టీడీపీ నాయకులు పొలిమేర పెద్దిరెడ్డి, ఎం బాలకోటయ్య, ఆర్ఐ రమణయ్య, వీఆర్‌వో హుసేన్, సర్వేయర్లు శివప్రసాద్, సాయి, వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

● సంగం:వెంగారెడ్డిపాళెం, సిద్దీపురంలో రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దారు సోమ్లా నాయక్ భూసమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచి ఆనం ప్రసాద్‌రెడ్డి, అన్నారెడ్డిపాళెం సాగునీటి సంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● సీతారామపురం:బాలాయపల్లిలో మంగళవారం తహసీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరిం చాలని రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీని వాసులు, సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో బాలయ్య పాల్గొన్నారు.

● ఉదయగిరి: కృష్ణంపల్లిలో తహసీల్దారు సుభద్ర రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో అంజాద్, సర్వేయర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

● వలేటివారపాలెం: డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌రసూల్ కాకుటూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు పరిష్కారానికే ప్రభుత్వం సదస్సులు ప్రారంభినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్ తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి సమస్యలు పరిష్కరించండి

కావలి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు మంగళవారం ఆసుపత్రి సూపరింటిండెంట్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి పెంచులయ్య, కృష్ణమోహన్‌లు మాట్లాడారు. ఏరియా వైద్యశాల పేరుకే వంద పడకల ఆసుపత్రి అని రోగులకు సరైన వైద్యం అందడం లేదని ఆరోపించారు. జ్వరాలు, జలుబు దగ్గు, వంటి నొప్పులకు మాత్రలు, సూదులు వేస్తారే తప్ప ఇతర జబ్బులతో వచ్చే రోగులను నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేస్తున్నట్లు మండిపడ్డారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం లేదని డ్రైనేజ్ సమస్య తీవ్రంగా వుందన్నారు.

ఆధార్, బర్త్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

● కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ



స్థానిక సమస్యలను తెలసుకుంటున్న సబ్‌కలెక్టర్ శ్రీపూజ

ఉలవపాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్టీ కుటుంబాలోని ప్రతిఒక్కరికీ ఆధార్ కార్డు, పిల్లలకు బర్త్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ అధికారులను ఆదేశించారు. మంగళవారం వీరేపల్లి, చాగొల్లులోని ఎస్టీ యానాది కాలనీల్లో పర్యటించారు. ఆధార్ కార్డులు ఎంత మందికి ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నపిల్లలను స్కూళ్లకు పంపించాలని ఆధార్ కార్డు, లేట్‌బర్త్ సర్టిఫికెట్లు లేని వాళ్లకు కాలనీలో ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేసి అందేలా చూడాలని తహసీల్దారు లావణ్య, ఎంపీడీవో విజయలకు సూచించారు.

అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించరేం?

● సీపీఎం నాయకులు మాల్యాద్రి

కావలి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డిలు ఎందుకు ఖండించరని సీపీఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి ప్రశ్నించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన వ్యవసాయ సంఘం నాయకులు రాధాకృష్ణయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ వ్యాఖ్యలకు దేశం మొత్తం ఖండిస్తే రాష్ట్ర ప్రముఖులు మిన్నకుండిపోవడం శోచనీయం అన్నారు.

పోలేరమ్మ తిరునాళ్లకు తొలి చాటింపు

అల్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా వెలసిన పోలేరమ్మ తిరునాళ నిర్వహణకు గ్రామంలోని మరోవర్గంకు చెందిన గ్రామపెద్దలు మంగళవారం తొలి చాటింపు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి తొలుత విశేష పూజలు చేసి అమ్మవారి ఆలయం ఎదుట హారతి కర్పూరాన్ని వెలిగించారు. కార్యక్రమంలో మేడా వెంకటేశ్వర్లు రెడ్డి, రామకృష్ణారెడ్డి, మేడా కృష్ణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, మేడా నిరంజన్‌రెడ్డి, దయాకర్ రెడ్డి పాల్గొన్నారు.

వినియోగదారుల దినోత్సవం

ఉదయగిరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.నారాయణ స్వామి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. హక్కులు, అవశ్యకతను వివరించారు

తిరునాళ్లకు ముందస్తు చర్యలు తీసుకోండి

● కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

అల్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేదీ మండలకేంద్రంలోని గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ తిరునాళకు అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకుని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఆర్డీవో వంశీకృష్ణ, రూరల్ డీఎస్పీ శ్రీధర్‌లతో కలసి అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రధానంగా విద్యుత్ శాఖ, పురపాలక శాఖ, పోలీసు శాఖలు కీలక బాధ్యత వహించాలన్నారు. ఈ శాఖల అధికారులంతా అప్రమత్తంగా ఉండి ఉత్సవ కమిటీకి సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ, సీఐ పాపారావు, నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వర రావు, ఉత్సవ కమిటీ సభ్యులు బాలకృష్ణంరాజు, పప్పు సుధాకర్, గుండవరపు సుధాకర్‌రెడ్డి, నాయకులు, మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, బిట్రగుంట చైతన్య రెడ్డి, కృష్ణ చైతన్య, బండి శ్రీనివాసుల రెడ్డి, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపె సమీక్ష

● కావలి: ఆర్అండ్‌బీశాఖ, పురపాలక శాఖ అభివద్ధి పనులపై మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత ఆర్ అండ్‌బీ అధికారులతో కలిసి తుమ్మలపెంట రోడ్డులో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే తన నివాసంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణ పారిశుధ్య పనుల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించారు.

● బాధిత కుటుంబానికి పరామర్శ

బిట్రగుంట: బోగోలు మండలం ముంగమూరు పంచాయతీ సాంబశివపురానికి చెందిన టీడీపీ నేత యర్రజొన్న శ్రీహరి తల్లి వెంకటమ్మ (89) అనారోగ్యం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మంగళవారం ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుమారుడు శ్రీహరి, కుటుంబ సభ్యులతో మాట్లాడి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగేశ్వరావు, ప్రధాన కార్యదర్శి సుధీర్‌బాబు, పార్టీ నాయకులు ఉన్నారు.



కావలి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వీడాలి

కందుకూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ఏమాత్రం అలసత్వం వహించకుండా మున్సిపాలిటీ అధికారులు, వార్డు సచివాలయ ఉద్యోగులు పని చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయాల సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొర్రపాటి అనూష, డీఈఈ గణపతి లు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నియోజకవర్గంలోని 13మంది బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సీఎం సహాయనిధి రూ. 7,63,731 చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దామా మల్లేశ్వర రావు, తల్లపనేని రవీంద్రబాబు, నాదెండ్ల వెంకట రమణయ్య, ఏకాంబరం వెంకటరావు, సాధు వేణు, ముప్పరాజు కృష్ణారావు, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేకి సత్కారం

వీఆర్ కోట ఆనకట్ట సిస్టం అధ్యక్ష, ఉపాధ్యక్షులు తల్లపనేని రవీంద్రబాబు, తోకల మాల్యాద్రిలు మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఆయకట్టు రైతులతో కలిసి స్థానిక పార్టీ కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యేను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. మాచవరం, మోపాడు చెరువుల కింద రైతులకు ఇబ్బందిలేకుండా చివరిభూములకు కూడా నీరందేలా చూడాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, వడ్డెళ్ల వెంకటరావు, తల్లపనేని మురళీకృష్ణ, రావుల రవి, పైనీడి వెంకటేశ్వర్లు, కొచ్చర్ల మాధవరావు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

పెరిగిన చలిగాలుల తీవ్రత

ఉదయగిరి రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం చలిగాలుల తీవ్రత పెరిగింది. ఉదయం నుంచే ఆకాశంలో ముసురేసి ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో కురిసిన చిరుజల్లులకు ప్రజలు బయటకు రాలేదు. వర్షం బలపడే అవకాశం ఉన్నందున కూలీలు, కార్మికులు నివాసాలకే పరిమితమయ్యారు. వృద్ధులు, పిల్లలు చలిగాలులకు తట్టుకోలేక రోజంతా స్వెట్టర్లు వేసుకున్నారు.

● ఉదయగిరి: పట్టణంలో చిరుజల్లులు కురిశాయి. ముసురుతో పాటు చలి గాలులు వీయడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాలతో సాగులోని శనగ, మినుము, కంది పంటల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. వర్షాలతో పంటలపై తెగుళ్ల విజృంభిం చడంతో పాటు దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని వారు వాపోయారు.

● సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలో రోజంతా ముసురు పట్టింది. సాయంత్రం వరకు తువ్వర పడుతూనే ఉంది. చల్లిగాలితో వృద్ధులు, చిన్నారులు వణికిపోయారు.

పోరుబాటను విజయవంతం చేయండి

వింజమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరెంటు చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 27న ఉదయగిరిలో నిర్వహించే వైసీపీ పోరుబాటను విజయవంతం చేయాలని మండల వైసీపీ కన్వీనర్ రేవునూరి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో వైసీపీ నాయకులు మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, కాటం రవీంద్రరెడ్డి, మాగంటి శ్రీనివాసులుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉదయగిరిలోని విద్యుత్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఏఈకి వినతిపత్రం అందచేస్తామన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోండి

ఆత్మకూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేనమ్మ తెలిపారు. మంగళవారం వెన్నవాడ రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయిలో వరి పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కిషోర్‌బాబు, వీఏఏ దీప పాల్గొన్నారు.

● సీతారామపురం: సింగారెడ్డిపల్లిలో మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఈవో సాంబశివయ్య, వీఏఏ స్వప్ననరేంద్ర,మార్కెటింగ్ అసిస్టెంట్ చిరంజీవి పాల్గొన్నారు.

వీధిలైట్ల మరమ్మతులు

వలేటివారిపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలినేనిపాలెంలో సర్పంచ్ అనుమోల అమరేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం వీదిలైట్లకు మరమ్మతులు చేపట్టారు. అడిగిన వెంటనే వీదిలైట్లకు పనులు చేయించిన సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు.

నాటుసారా తయారుచేస్తే చర్యలు

బిట్రగుంట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ చేసినా, అమ్మకాలు చేపట్టినా చర్యలు తప్పవని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జే.రమేష్, జగదీష్‌రెడ్డిలు తెలిపారు. మంగళవారం వీరు కప్పరాళ్ళతిప్ప, బోగోలు, చెంచులక్ష్మీపురం, నాగులవరం, సోమేశ్వరపురం గ్రామాల్లో సిబ్బందితో విస్తృత దాడులు నిర్వహించారు. వీరి వెంట కావలి ఎక్సైజ్ ఎస్సై దేవిక, కావలి, బుచ్చి సీఐలు శ్రీనివాసరావు, జలీల్, కోవూరు, కావలి స్టేషన్ల ఎస్సైలు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థి దశ ఎంతో కీలకం


ఆత్మకూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ ఎంతో కీలకమని, పలువురు విద్యార్థులు డ్రగ్స్‌కి అలవాటుపడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని సీఐ జీ గంగాధర్ తెలిపారు. స్థానిక ప్రగతి ఇంగ్లీష మీడియం స్కూల్‌లో మంగళవారం మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్‌పై అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

అనంతసాగరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కామిరెడ్డిపాడు, సోమశిలలోని పేదలకు మంగళవారం వెంగంపల్లి ఎంపీటీసీ యనమల వనమ్మ, రాపూరుకు చెందిన పాపకన్ను నిరంజన్‌రెడ్డి సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమణయ్య, కృష్ణ పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ
రూరల్, కోవూరు, సర్వేపల్లి

ప్రీ క్రిస్మస్ సంబరాలు

నెల్లూరు(విద్య), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ముందస్తు క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. పాఠశాలల్లో వేడుకలు జరిగాయి.

● సరస్వతి నగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు శాంటాక్లాజ్, దేవదూతల వస్త్రధారణలో క్యారల్స్ పాడుతూ నిర్వహించిన కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి, జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, ప్రిన్సిపాళ్లు నాగేంద్ర, జాస్మిన్, మణిమాల, ప్రపూర్ణ, ఏవో సునీల్, మేనేజర్ అజయ్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వేదాయపాళెంలోని శ్రీసాయి మహావిద్యాలయ పాఠశాలలో ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు శాంటాక్లాజ్, ఏంజెల్స్ దుస్తులు ధరించి క్రిస్మస్ విశిష్టతను, జీసస్ జీవిత విశేషాలను తెలియచేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కరస్పాండెంట్ టీ నారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వస్త్రదానం

నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు తలారి బాలసుధాకర్ మంగళవారం నగరంలోని ఆయన నివాసం వద్ద ప్రీ కిస్మస్ వేడుకలు నిర్వహించారు. పేదలకు వస్త్రదానం చేశారు. సాల్వేషన్ ఆర్మీ చర్చి నెల్లూరు డివిజన్ కమాండర్ రూథర్ శామ్యూల్, మండల స్త్రీ విభాగం అధ్యక్షురాలు సాత్వికం, కోర్ కమాండర్ వెంకటేశ్వరావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. విజయప్రసాద్, మేరీ గ్రేస్, చినబాబు, మనోహర్ పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న బాలసుధాకర్ తదితరులు

కళా శుభాకాంక్షలు

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ సందర్భంగా సూక్ష్మ చిత్రాల రూపకర్త సోమా పద్మరత్నం కొవ్వొత్తిపై క్రీస్తు, శిలువ రూపాలను చిత్రించారు. అలాగే రావి ఆకుపై క్రీస్తు శిలువ చిత్రాన్ని సృజనాత్మకంగా మలిచారు. వీటిద్వారా క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలలో సెమీ క్రిస్మస్ సందడి

పొదలకూరు(ఆంధ్రజ్యోతి): స్థానిక నాగార్జున ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రతినిధులు బి.సునీతారెడ్డి, ఎ.సుబ్బారావు, ఏ.చంద్రశేఖర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ తాతా (శాంటాక్లాజ్) వేషధారణలో విద్యార్థులు చాక్లెట్లు పంచారు. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నా యి. అకడమిక్ డీన్ కృష్ణ, డైరెక్టర్ జీఎస్.రెడ్డి, వైస్ ప్రిన్సి పాల్ పాపయ్య, ఏవో జీవీఆర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబైన చర్చిలు

సైదాపురం,(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు మండలంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. సైదాపురం, కలిచేడు, చాగణం, మర్లపూడి గ్రామాల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.





ఎమ్మెల్యే శుభాకాంక్షలు

బుచ్చిరెడ్డిపాళెం,(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా బుచ్చినగర పంచాయతీ, మండలంతోపాటు నియోజకవర్గంలోని క్రైస్తవులకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జీసెస్ జీవితం ప్రపంచ మానవాళికి ఆదర్శం కావాలని పేర్కొన్నారు.

కానుగ ఆకుపై ఏసుక్రీస్తు

క్రిస్మస్ పర్వదినం సందర్భంగా కానుగ ఆకుపై మండలంలోని మహమ్మదాపురానికి చెందిన సూక్ష్మ చిత్ర కళాకారుడు పచ్చా పెంచలయ్య పశువుల పాకలోని మేరీమాత, జోసఫ్ చేతుల్లో ఉన్న బాలయేసు చిత్రాన్ని అద్భుతంగా గీశారు.

- పొదలకూరు,(ఆంధ్రజ్యోతి)

క్రిస్మస్.. క్రిస్మస్

క్రిస్మస్ పండుగ సందర్భంగా నగరంలోని చర్చిలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. క్రీస్తు రాక సందర్భంగా ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బాల ఏసు జనన వాటికలను అందంగా ముస్తాబు చేశారు. నగర కూడళ్లలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ బొమ్మలు, నక్షత్రాలు ఆకట్టుకున్నాయి.





మైనార్టీల సమస్యలు పరిష్కరించండి

● షరీఫ్‌కు ముస్లింల వినతి

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మైనార్టీల సమస్యలు పరిష్కరించాలని మైనార్టీ సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారుడు అహ్మద్ షరీఫ్‌ను ముస్లిం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడు తూ మైనార్టీ గురుకుల పాఠశాల భవనాలను పూర్తి చేయాలని, మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మహమ్మదీలకు బీసీ సర్టిఫికెట్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవాజ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫీ, కోశాధికారి షేక్ చాన్‌బాషా, షేక్ నజీర్‌బాషా, సయ్యద్ అన్వర్, మహమ్మద్ సర్దార్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కళాభారతి ఎగ్జిబిషన్ ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శ్రీరాజరాజేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి కళాభారతి చేనేత హస్తకళల ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్ రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ చేనేత హస్త కళల వస్తువులను, వస్త్రాలను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు. ఎగ్జిబిషన్ నిర్వాహ కులు జెల్లా సత్యనారాయణ, కిషోర్ మాట్లా డుతూ చేనేత వస్త్రాలు, పోచంపల్లి, కళంకారీ, మంగ ళగిరి, గద్వాల్, చీరాల, బెంగాల్, మధ్యప్రదేశ్ చేనేత చీరలు, డ్రస్ మెటీరియల్స్ ఉన్నాయని చెప్పారు. జయపూర్ బెడ్‌షీట్లు, చిన్నారులకు డ్రెస్సులు ఉత్పత్తి ధరలకే లభిస్తాయని తెలిపారు. కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, హైదరాబాద్ ముత్యాలు, ఖాదీ గ్రామోద్యోగ్ ఆయుర్వేద మందులు, బంజారా ఉత్పత్తు లు, 1గ్రామ్ గోల్డ్ ఆభరణాలు విక్రయిస్తున్నామని, ప్రజలు ఆదరించాలని కోరారు.


ఎగ్జిబిషన్ ప్రారంభించి వస్త్రాలను పరిశీలిస్తున్న జిల్లాదేవదాయ శాఖ సహాయ కమిషనర్

కోమాలో ఉన్న రోగికి పునర్జన్మ

● కిమ్స్ ఆసుపత్రి డాక్టర్లు సతీష్‌కుమార్, అభినయరెడ్డి

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కిమ్స్ ఆసుపత్రిలో కోమా లో ఉన్న రోగికి వైద్యులు పునర్జన్మ ప్రదర్శించారు. మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సతీష్‌కుమార్, న్యూరాలజిస్ట్ డాక్టర్ అభినయ రెడ్డి మాట్లాడారు. తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన రాజేష్ (39) అనే వ్యక్తి మూర్ఛ వ్యాధితో ప్రమాదకరమైన స్క్రబ్‌టైఫస్ ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యాడని చెప్పారు. దీంతో కోమాలోకి వెళ్లిన బాధితుడు ఐదు రోజులుగా వెంటిలేటర్‌పై ఉన్నా డన్నారు. ఇతర అవయవాలపై తీవ్ర ప్రభావం పడటంతో వైద్య బృందం ప్రత్యేక చికిత్సలు అందించిందని, ప్రస్తుతం రాజేష్ పూర్తిగా కోలుకున్నాడని చెప్పారు. ఈ సమావేశంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రవికిరణ్, ఎమర్జెన్సీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, ఈడీ గిరినాయుడు, డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ సతీష్‌కుమార్

యూనివర్సిటీ సందర్శించిన పూర్వ వీసీ

వెంకటాచలం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీని మంగళవారం పూర్వ వీసీ రొక్కం సుదర్శన్ రావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు, రిజిస్ట్రర్ డాక్టర్ కె.సునీతలను కలిశారు. అనంతరం యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. అభివృద్ధి కోసం విద్య, పరిశోధన, వ్యవసాయం, పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణల గురించి సుదర్శన్‌రావు వివరించారు.

యూనివర్సిటీ ఉద్యోగికి ఘన నివాళి

విక్రమ సింహపురి యూనివర్సిటీలోని నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న శిఖరం ద్వారకా మంగళవారం మృతి చెందారు. దీంతో ఆయన చిత్రపటానికి వీసీ సారంగం విజయభాస్కర్‌రావు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో యూనివర్సిటీ రిజిస్ట్రర్ డాక్టర్ కె.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, కావలి కళాశాల ప్రిన్సిపాల్ టి.వీరారెడ్డి, డాక్టర్ సాయిప్రసాద్‌రెడ్డి, డాక్టర్ సుజయ్ కుమార్, తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు చద్ది నివేదన

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడలో మంగళవారం గ్రామదేవత పోలేరమ్మకు భక్తులు చద్ది సమర్పించారు. ముందుగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. గత మంగళవారం నుంచి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మరో మూడు వారాలపాటు జరుగుతుందని పూజారులు, పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పోలేరమ్మకు చద్ది నివేదిస్తున్న భక్తులు

ఉచిత పశువైద్య శిబిరం

వెంకటాచలం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటకృష్ణపురంలో మంగళవారం స్వర్ణభారత్ ట్రస్ట్, మండవ ఫౌండేషన్, పశు సంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. కనుపూరు పశువైద్యాధికారి డాక్టర్ ఏ.రామచంద్రారెడ్డి, మండవ ఫౌండేష న్ పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులునా యుడు పశువులు, గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి.రాము, సుధీర్, శ్రావణ్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళితులు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై ప్రమాణ చేసి కేంద్ర హోంశాఖా మంత్రిగా కొనసాగుతున్న అమిత్‌షా ఆ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను హేళనగా మాట్లాడినందుకు తక్షణం ఆయనను బర్తరఫ్ చేయాలని దళిత నాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో దళిత నాయకులు బుచ్చిరెడ్డిపాళెంలోని జొన్నవాడ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు ప్రభుదాస్ మాట్లాడుతూ దేశ ప్రజల ఆరాధ్యదైవం అంబేడ్కర్‌ను హేళనగా మాట్లాడిన అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై 27న వైసీపీ నిరసన

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుపై ఈనెల 27న బుచ్చిరెడ్డిపాళెంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన బుచ్చిలోని వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గం స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ బుచ్చి బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్‌వరకు నిరసన ర్యాలీ ఏపడుతామ న్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, నాయకులు నలుబోలు సుబ్బారెడ్డి, గొల్లపల్లి విజయ్‌కుమార్, మావులూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నుడా చైర్మన్‌కు సత్కారం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని మంగళవారం నుడా కార్యాలయంలో జనసేన పార్టీ నాయకులు కలిసి సత్కరించారు. పార్టీ నగర అధ్యక్షుడు సుజయ్‌బాబు, జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా, నగర ప్రధాన కార్యదర్శి శనివారపు అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శివగిరి కాలనీలో పేకాటాడుతున్న పది మంది జూదరులను మంగళవారం చిన్నబజారు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.7,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని ప్రజలు డయల్ 112కుగానీ సమీప పోలీసుస్టేషన్‌కుగానీ తెలియజేయాలని కోరారు.

డీఎంహెచ్‌వోకి శుభాకాంక్షలు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డీఎంహెచ్‌వోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సుజాతను ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ నేతలు మంగళవారం సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నెపల్లి పెంచలరావు, బండారుపల్లి వెంకటేశ్వర్లు, గాదిరాజు రామకృష్ణ, అంజనేయవర్మ, ప్రసాద్‌రెడ్డి, పెంచలయ్య, కరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ

నెల్లూరు(విద్య), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో డీకేడబ్ల్యూ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటి విజేతలుగా నిలిచారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి తెలిపారు. మంగళవారం కళాశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారన్నారు. తమ విద్యార్థినులు ఎల్ సుమ, బీ వెంకట రమణ, వాణి ప్రథమ స్థానం సాధించారని, మొత్తం 9 మంది విద్యార్థినులు బహుమతులు అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీ చెంచురామయ్య, కే వెంకటరమణ పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర కలశ పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం సహస్ర కలశ పూజ వైభవంగా జరిగింది. కేరళ తంత్రుల ఆధ్వర్యంలో మండల పూజతోపాటు విశేష పూజలు జరిపారు. కట్టా చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీ, బాలకవి శరత్‌బాబు, పద్మలలిత, నూతలపాటి రవికుమార్, ఇందిర ఉభయకర్తలుగా వ్యవహరించారు.


అయ్యప్పగుడిలో సహస్ర కలశ పూజ చేస్తున్న పండితుడు

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి : టీడీపీ

కొడవలూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని టపాతోపులో పూరిగుడిసెల్లో ని వాసం ఉంటున్న నిరుపేదలకు స్థల పట్టాలు ఇవ్వాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కోరారు. మండ లంలోని నార్తురాజుపాలెంలోని టీడీపీ కార్యా యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏళ్లతరబడి గ్రామంలో ఉన్న అసైన్డ్ భూముల్లో వారు గుడిసెలు వేసు కుని నివాసం ఉంటున్నారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి వారికి పట్టాలు అందేలా కృషి చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాటూరు రమేష్, బాబి, తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూ సదస్సులకు 18 అర్జీలు

మనుబోలు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాళెం సచివాలయ పరిధిలోని పిడూరుపాళెం, వెంకన్నపాళెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 18మంది రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించాలంటూ తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్యకు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, సర్వేయర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● సైదాపురం : మండలంలోని దేవరవేమూరులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సాగు భూములకు పట్టాలు, రేషన్ కార్డుల మంజూరు, భూసర్వేల కోసం రైతులు తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోజంతా ముసురు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 24(ఆంధ్ర జ్యోతి): మండలంలో మంళవారం చిరు జల్లులతో రోజంతా ముసురు పట్టింది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. అయితే ఈ వర్షం ఆగకుండా కురిస్తే వరిపైరులో పిలకలపై ప్రభావం చూపుతుందని, దీంతో పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



2024 వెలుగు నీడలు



తొలిసగం గతుకులు



సూళ్లూరుపేటలో జీఎన్‌టీ రోడ్డు రిపేర్లకు రూ.40 లక్షలు

సూళ్లూరుపేట పట్టణం జీఎన్‌టీ రోడ్డు నిర్వహణకు గత వైసీపీ ప్రభుత్వం నిధులివ్వలేదు. దీంతో భారీ గోతులు ఏర్పడి రోడ్డు అధ్వాన్నంగా మారింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు మరమ్మతులకు రూ. 40 లక్షలు మంజూరు చేసింది. త్వరలోనే పనులు మొదలు కానున్నాయి.

అధికారంలో ఉన్న ఏ పార్టీకి అయినా కనీసం ఎన్నికలకు ముందైనా ప్రజలంటే కాస్త భయం ఉంటుంది. పట్టించుకుంటున్నాం.. అని చెప్పుకోవడానికైనా కొన్ని పనులు చేస్తారు. ప్రజల తీవ్ర అవస్థలు గుర్తించి.. కాస్తయినా సరిదిద్దేందుకు పూనుకుంటారు. తను పట్టిన కుందేటికి కాళ్లే అవసరం లేదని నమ్మే నాయకులు తప్ప ఇంత మొండిగా ఉండరు. అందుకు ఫలితం ఎలా ఉంటుందో 2024 చాచికొట్టి మరీ ప్రకటించింది. జగన్ ప్రభుత్వం అయిదేళ్ల గతుకుల పాలన 2024 తొలిసగంలోనూ యధాతథంగా కొనసాగింది. అందుకు నిలువెత్తు సాక్ష్యం జిల్లాలోని రోడ్లు. చారెడు మట్టి వేయలేదు. కొత్తవి నిర్మించలేదు. వానలు వరదలొచ్చి దెబ్బతిన్నా పట్టించుకోలేదు. అందుకే.. అధికారంలోకి వచ్చీరాగానే కూటమి ప్రభుత్వం రోడ్ల బాగుకు పూనుకున్నది. ముందుగా అతుకులు వేసి గతుకులు పూడ్చే పని మొదలైంది. జిల్లా రోడ్ల తీరుతెన్నుల వెలుగునీడల సమాహారం....

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

గతుకులు మిగిల్చిన జగన్

తొలిసగం: జిల్లావ్యాప్తంగా ప్రధాన రహదారులు, గ్రామీణ రహదారులు అనే తేడా లేకుండా అన్నీ అధ్వాన్నంగా మారాయి. అడుగడుగునా గోతులతో ప్రధాన రహదారులు వాహనదారుల సహనానికి పరీక్ష పెట్టాయి. కిలోమీటర్ల కొద్దీ తారులేచిపోయి, కంకర బయటపడి తరచూ వాహనదారులను ప్రమాదాలకు గురి చేశాయి. గ్రామీణ రహదారులైతే చాలావరకూ రూపు కోల్పోయాయి. అడపాదడపా సంభవించిన తుఫాన్లు రహదారులను మరింతగా దెబ్బతీశాయి. నయాపైసా నిధులు విదిలించలేదు. వైసీపీ నాయకులకే రోడ్లు తలనొప్పి వ్యవహారంగా మారాయి. సార్వత్రిక ఎన్నికల వరకూ కూడా జిల్లాలోని రోడ్ల గురించి పట్టించుకున్నవారే లేరు.

మలిసగం అతుకులు

విలక్షణమైన కాలానికి సాక్ష్యం 2024 సంవత్సరం. విభజనతో కునారిల్లుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండు భిన్న దృక్పథాలుగల ప్రభుత్వాలను చూసింది. ఈ ఏడాది మే 13న సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. జూన్ 4న ఫలితాలు ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వం ఘోర పరాజయాన్ని చవిచూసింది. కూటమి ప్రభుత్వం 12న బాధ్యతలు స్వీకరించింది. విధ్వంసమే పాలనగా సాగిన కాలానికి రోజులు చెల్లాయి. ఇటుక ఇటుకా పేర్చి పునర్నిర్మాణం మొదలైంది. అయిదున్నర నెలల జగన్ పాలనకూ, చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఆరున్నర నెలల పాలనకూ ఉన్న తేడాలను జిల్లా ప్రజలు చూస్తున్నారు. ఆ తేడాలను వెల్లడించే సచిత్ర వరుస కథనాల్లో మొదటిది ఇది.

అతుకులేస్తున్న కూటమి

మలిసగం: అప్పుల కుప్పగా మారిన ఆంధ్రప్రదేశ్ పాలనా బాధ్యతలు స్వీకరించిన కూటమి ప్రభుత్వం తొలి చూపు రోడ్లమీదే పడింది. ఆర్థిక సంక్షోభం కారణంగా పూర్తిస్థాయిలో రోడ్ల పునర్నిర్మాణానికి వీలులేకపోయినా వాహనదారులకు తక్షణ ఉపశమనంగా గోతులు పూడ్చి మరమ్మతులు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం జిల్లాకు తక్షణం రూ. 80 కోట్లు మంజూరు చేసింది. 1208 పనులు గుర్తించింది. యుద్ధప్రాతిపదికన 1051 పనులు పూర్తయ్యాయి. మరో 157 పనులు పురోగతిలో వున్నాయి.



ఇప్పుడు..

రోడ్డు మరమ్మతులు జరిగాక..



అప్పుడు..

గూడూరు పట్టణ శివార్లలోని చెన్నూరు వద్ద ఎన్నికల ముందు వరకిలా..



ఇప్పుడు..

కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో తాజాగా మరమ్మతులు చేపట్టాక బంగారుపేట వద్ద రోడ్డు ఇలా..



అప్పుడు..

వైసీపీ ప్రభుత్వం నిధులివ్వక వెంకటగిరి శివారు బంగారుపేట వద్ద ఆర్‌అండ్ బీ రోడ్డు దుస్థితి





తడ మండలం రామాపురంలో మూడు రోజుల కిందటి వరకూ వున్న మట్టి రోడ్డు.. పల్లె పండుగ తో సిమెంటు రోడ్డుగా మారిందిలా..

వంద కోట్లతో పల్లె రోడ్లకు పండుగ

దారుణంగా వున్న గ్రామీణ రోడ్లపైనా దృష్టి పెట్టారు. పల్లె పండుగ పేరిట సీసీ రోడ్లు, తారు రోడ్లు, మెటల్ రోడ్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు.మొత్తం 1604 రోడ్ల నిర్మాణానికి రూ. 100.15 కోట్లు మంజూరు చేశారు.



కొత్తగుంట-కోగిలి రోడ్డు మరమ్మతులకు రూ. 10 లక్షలు

చిట్టమూరు మండలం ఉడతావారిపాలెం నుంచి శ్రీహరికోట రోడ్డు వరకూ వున్న లింకు రోడ్డు పరిస్థితి దారుణంగా వుంది. గత ప్రభుత్వం నిర్వహణ గురించి పట్టించుకోలేదు. తాజాగా ప్రభుత్వం ఈ రోడ్డు మరమ్మతుల కోసం రూ. 10 లక్షలు మంజూరు చేసింది.



అప్పుడు..

జూలై నాటికి పాకాల మండలం ఊట్లవారి పల్లి వద్ద రోడ్డు దుస్థితి



ఇప్పుడు..

మరమ్మతులు జరిగాక చక్కగా కనిపిస్తున్న రోడ్డు



ఇప్పుడు..

బాగుపడిందిలా..



అప్పుడు..

కోట మండలం గూడలి వద్ద గోతులతో దెబ్బ తిన్న రోడ్డు

అప్పుడు..



శ్రీకాళహస్తిలో ఏపీ సీడ్స్ కూడలి వద్ద గోతులతో దెబ్బతిన్న రోడ్డు



ఇప్పుడు..

చక్కగా మారిందిలా..

నరకయాతన

- పుట్టినప్పటి నుంచీ అంతుపట్టని వ్యాధితో సతమతం
- ఆదుకోవాలంటూ రెవెన్యూ సదస్సులో చిన్నారుల వేడుకోలు

మాడిపోయినట్లుండే శరీరం. వాతావరణ పరిస్థితులతో చర్మం పగుళ్లిస్తుంది. రక్తం కారుతుంది. తట్టుకోలేని మంటలతో ఆ ఇద్దరు చిన్నారులు నరకయాతన అనుభవిస్తున్నారు. వీరిని చూసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. వీరి ఆరోగ్య బాగుకు దాతలు సహకరించాలని కోరుతున్నారు.

- కోట, ఆంధ్రజ్యోతి

కోట మండలం కర్లపూడి బీసీ కాలనీలోని ఊడత వెంకటసుబ్బయ్యకు ముగ్గురు పిల్లలు. మొదటి ఆడబిడ్డ ఆరోగ్యంగా ఉంది. ఆ తర్వాత జన్మించిన ఇద్దరు కుమారులు.. నాగరాజు, హర్షకు చిన్నప్పటి నుంచీ శరీరం, ముఖం, నల్లగా మాడిపోయి దద్దులుగా ఉన్నాయి. చర్మంపై చెమట పట్టకుండా తడి ఆరిపోయి పట్టలు పట్టలుగా పగిలిపోతూ ఉంటుంది. ఆ క్రమంలో రక్తం, నీరు కారుతూ ఉంటాయి. రాత్రి వేళ నిద్రపోలేని పరిస్థితి. వర్షాకాలం ఒకలా.. ఎండలోకి వెళ్లితే మరోలా వీరిద్దరి చర్మం మరింతగా బిగిసుకుపోయి పగిలిపోతుంది. తమ పిల్లల నరకయాతనను చూడలేక తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారు. అప్పులు చేసి వీరిని చెన్నైలోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. జన్యులోపం ఉండొచ్చని.. పదేళ్ల తర్వాత చర్మం సర్దుబాటు చేస్తామని వైద్యులు చెప్పినట్లు వీరి తండ్రి వెంకటసుబ్బయ్య తెలిపారు. నిరుపేదలైన ఇక్కడికే వైద్యం చేయించలేక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. దాతలు సాయం అందించాలని కోరుతున్నారు. ప్రస్తుతం కర్లపూడి ప్రభుత్వ పాఠశాలలో నాగరాజు 5వ తరగతి, హర్ష ఒకటో తరగతి చదువుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం కర్లపూడిలో జరిగిన రెవెన్యూ సదస్సుకు నాగరాజు, హర్ష చేరుకొని తమకు ప్రాణబిక్ష పెట్టాలని తహసీల్దారు జయజయరావును కోరారు. ఆయన రూ.5వేలు వితరణగా ఇచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వపరంగా ఆదుకునేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



నాగరాజు, హర్ష

ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించం

- త్వరలో మూడు కేంద్రాల నుంచి పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించేది లేదని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టంచేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి మొదటి వారంలో జిల్లాలో మూడు డిసిల్టేషన్ పాయింట్ల నుంచి ఇసుక ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 1,37,686మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. స్వర్ణముఖి నదీ తీరప్రాంతమైన పెళ్లకూరు మండలం పుల్లూరు గ్రామం, దిగువకలువకూరు, కోట మండలం గుడాలిగ్రామంలో ఇసుక అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఇసుక తవ్వడానికి, రవాణాకు ఏజెన్సీకి అప్పగించామన్నారు. ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్నా లేదా నేరుగా వెళ్లి నామమాత్రపు రుసుం చెల్లించి ఈ స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక పొందవచ్చన్నారు. ఇసుక ధర, రవాణా తదితర సమాచారం అన్ని సచివాలయాల్లో, తహసీల్దారు, ఎంపీడీవో, పోలీసు కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. సరిహద్దు ప్రాంతమైన తడ, గాదంకి, సురుటుపల్లి చెక్‌పోస్టుల వద్ద పోలీసు, రెవెన్యూ నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ సుబ్బరాయుడు, అధికారులు భానుప్రకాష్ రెడ్డి, బాలాజీనాయక్, శ్రీనివాసరావు, మురళీ మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

43 గ్రామ సభలకు 648 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం 43 గ్రామసభలు జరగగా 648 అర్జీలు అందాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. వీటిలో 68 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించగా, మిగిలిన వాటిని కాలపరిమితిలోపు అధికారులు పరిష్కరిస్తారన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ తేదీలు మారాయ్!

తిరుపతి(కలెక్టరేట్)/దొరవారిసత్రం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్ తేదీలు మారినట్లు తెలిసింది. తొలుత జనవరి 10 నుంచి మూడు రోజుల పాటు జరగాల్సి ఉండేది. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రావడం, శ్రీవారి దర్శనానికి వీవీఐపీల తాకిడి ఎక్కువగా ఉండటంతో ఫ్లెమింగో ఫెస్టివల్ (పక్షుల పండుగ)ను సంక్రాంతి తర్వాత నిర్వహించాలని యంత్రాంగం భావించింది. ఆ ప్రకారం జనవరి 17 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించడానికి కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్ణయం తీసుకున్నారు. గత షెడ్యూల్‌లో ఏవిధంగా కార్యక్రమాలు, వేదికలు ఉన్నాయో అదే విధంగా అంగరంగ వైభవంగా నిర్వహించడానికి కలెక్టర్ నేతృత్వంలో కమిటీ సంసిద్ధమైంది.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

- మరో రెండు రోజుల పాటు వర్ష సూచన
- తీరం వెంబడి చలి గాలుల తీవ్రత అధికం

సూళ్లూరుపేట/కోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాకు భారీ వర్షాల ముప్పు పొంచి ఉంది. మంగళవారం తెల్లవారుజామున సూళ్లూరుపేటలో చలి గాలులతో కూడిన తేలికపాటి జల్లులు పడ్డాయి. ఇది బలపడితే ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు మరో రెండు రోజుల పాటు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది. ప్రస్తుతం తీరానికి సమీపంలో కదులుతున్న క్రమంలో మేఘాలు కమ్ముకుని, చలిగాలులు వీస్తున్నాయి. సముద్రంలో గంటకు 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తుండటంతో అల్లకల్లోలంగా ఉంటుందని మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. కాగా, కోట మండలం గోవిందపల్లిపాలెం, శ్రీనివాస సత్రం గ్రామాల సమీపంలో మంగళవారం సముద్రం కల్లోల భరితంగా మారింది. దీంతో మత్స్యకారులు చేపలవేట నిలిపివేశారు.



విద్యుద్దీపాల వెలుగులో తిరుపతి వెస్ట్ చర్చి



ప్రార్థనల సందర్భంగా పాస్టర్ ఆశీర్వాదం

క్రిస్‌మస్‌కు చర్చిల ముస్తాబు

క్రిస్‌మస్‌కోసం జిల్లాలో చర్చిలు ముస్తాబయ్యాయి. ఏసుక్రీస్తు జననానికి సంబంధించి గొర్రెలపాక, బొమ్మలు, లైట్ స్టార్లు, క్రిస్మస్ ట్రీ, క్రైస్తవుల ఇళ్లు, చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో మంగళవారం సాయంత్రానికి ప్రత్యేకంగా అలంకరించారు. అర్ధరాత్రి దాటాక క్రైస్తవ కుటుంబ సభ్యులు కేక్‌లను కట్‌చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా, జిల్లాలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో కిస్మస్ జరుపుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపారు.

- తిరుపతి (కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి







క్రీస్తు జననం ఘట్టాల నమూనా



మంచుకొండలు కాదు.. మనూరే!

ప్రకృతి బహు విచిత్రమైనది. ఒక్కోసారి కశ్మీరం అవతలుండే కాంచన జంగనూ, విశాఖ ఆవలవుండే లంబసింగ్ లోయనూ కూడా మన కళ్ల ముందుకు తెస్తుంది. మబ్బులు కమ్మిన మంగళవారం సాయంత్రం తిరుపతి ఫ్లై ఓవర్ మీదుగా తిరుచానూరు వైపు ప్రయాణిస్తున్న వారికి కనువిందు చేసిన దృశ్యం ఇది. తెల్లమబ్బుల ముట్టడిలో అప్పలాయగుంట నల్లకొండలు ఇలా కనిపించాయి.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

హుండీ ద్వారా రూ.4.12 కోట్లు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 29 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం : రూ.4.15 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 65,656

తలనీలాలు సమర్పించినవారు : 24,360

సేవా పరిమళం @ 160 ఏళ్లు





ఆగస్టీమీలియస్ విగ్రహం

నాయుడుపేటలో 160 ఏళ్ల చరిత్రను సొంతం చేసుకున్న లూథరన్ చర్చి సేవకు చిరునామాగా నిలుస్తోంది. సేవలను విశ్వవ్యాప్తం చేసే క్రమంలో ఆగస్టీమీలియస్ ఆధ్వర్యంలో 1865లో నాయుడుపేటలోని 15 ఎకరాల్లో ఈ చర్చి మొదలైంది. ఈ ప్రార్థనాలయం నేటికీ చెక్కుచెదరని చారిత్రాత్మక కట్టడాలకు తార్కాణంగా నిలుస్తుంది. నాడు బాగా వెనుకబడిన ఈ ప్రాంతంలో చర్చి ఆధ్వర్యంలో పలు విద్యాలయాలు ఏర్పాటయ్యాయి. వైద్య సేవలను దగ్గరకు చేర్చి బాధితులకు అక్కున చేర్చుకుంది. కుటుంబ ఆదరణ కోల్పోయిన, వితంతు, వృద్ధులను ఆగస్టీమీలియస్ స్త్రీబా హోమ్ ఏర్పాటు చేసి అండగా నిలిచారు. జర్మనీ నుంచి మీలియస్ మనదేశంలో అడుగుపెట్టాక ఇక్కడి స్థితిగతులకు చలించిపోయారు. సేవకు అంకితం కావాలని సంకల్పించారు. ఇందులో భాగంగా చెన్నై, సూళ్లూరుపేట, నాయుడుపేట, రాజమండ్రి, గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి, రాపూరు, కోడూరు, వాకాడు తదితర ప్రాంతాల్లో చర్చిలను ఏర్పాటు చేశారు. సేవామూర్తిగా పదుగురి గుండెల్లో నిలిచిపోయారు. 1887 మే 21న ఈ కరుణామయుడు నాయుడుపేట చర్చిలోనే తుదిశ్వాస విడిచారు. దీంతో మీలియస్ సమాధిని చర్చిలోనే ఏర్పాటు చేశారు.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి

విద్యాకాంతులకు ప్రతీక





ఎస్‌ఏఎల్‌సీ చర్చి - క్రిస్మస్ సందర్భంగా ముస్తాబవుతున్న చర్చిలోని ప్రాంగణం

జర్మనీకి చెందిన డాక్టర్ మీలియస్ చొరవతో 1867లో గూడూరులో సెయింట్ పాల్ పీటర్స్ లూథరన్ (ఎస్ఏఎల్‌సీ) చర్చి ఏర్పాటైంది. ప్రార్థనలకే పరిమితం కాకుండా ఈ చర్చి సేవాపరిమళాలను వెదజల్లింది. ఇంగ్లీషు మీడియం పాఠశాల, వసతి గృహాన్ని నిర్వహించి అట్టడుడు వర్గాల్లో విద్యజ్యోతులను వెలిగించింది. ఎస్ఎంజీ పాఠశాల ఎందరో విద్యార్థులకు బతుకుదారి చూపించింది. అప్పటిలోనే ఇంగ్లీష్ మీడియంలో ఇక్కడ బోధించేవారు. గూడూరుతో పాటు చిల్లకూరు, మనుబోలు, సైదాపురం, బాలాయపల్లి ప్రాంతాల నుంచీ వేల సంఖ్యలో ప్రజలు ఈ చర్చికి వచ్చేవారు. 157 ఏళ్ల చరిత్ర కలిగిన సెయింట్ పాల్ పీటర్స్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా మతాలకు అతీతంగా ప్రజలు వేడుకల్లో పాల్గొంటారు. - గూడూరు, ఆంధ్రజ్యోతి

పుత్తూరులో 117 ఏళ్ల చర్చి



పుత్తూరులో బ్రిటిష్ కాలంలో కోన్‌లాగా నిర్మించిన ఈ ఎత్తయిన చర్చి... పట్టణానికి మరో వారసత్వపు ఆభరణం. దక్షిణ భారత సెయింట్ లూథరిన్ చర్చి ఆధ్వర్యంలో 1907లో ఈ చర్చిని నిర్మించారు. 2007లో వందేళ్ల ఉత్సవాలను నిర్వహించారు. కిలోమీటరు నుంచి చూసినా కనిపించే ఈ భవనాన్ని క్రైస్తవులు భద్రంగా కాపాడుకుంటున్నారు. దాదాపు వంద మంది కూర్చుని ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఈ భవనం వుంది.

- పుత్తూరు, ఆంధ్రజ్యోతి

నారావారిపల్లె సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి: ప్రద్యుమ్న



సమావేశంలో మాట్లాడుతున్న సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న

శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఎం స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లె సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పరిపాలనా భవనంలో మంగళవారం ఆయన జిల్లాలోని పలు అభివృద్ధి ప్రాజెక్టులపై అధికారులతో సమీక్షించారు. అసెట్స్ సర్వే చేపట్టాలని, స్వయంశక్తి ప్లస్, వృత్తి నైపుణ్యం యువతకు అవసరమైన పరిశ్రమలు, ఉపాధి శిక్షణ స్కిల్ ప్రొఫైల్ సిద్ధం కావాలన్నారు. జిల్లాలో తిరుమల, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలు, సముద్రతీరం, ఐఐటీ వంటి కేంద్ర విద్యాసంస్థలు, ఈఎంసీ, శ్రీసిటీ, షార్, గుడిమల్లం ఆలయం వంటి విశేషమైన డైవర్సిఫైడ్ సిస్టం ఉండటం విశేషమన్నారు. యూనిక్ ప్రొడక్ట్ మిషనరీ ఉపయోగించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. మామిడికి ప్రత్యామ్నాయంగా ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలన్నారు. కనీసం రెండు అటానమస్ డ్రోన్లనయినా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పోలీసు శాఖ అవాంఛనీయ సంఘటనలను అరికట్టవచ్చన్నారు. స్టాండ్‌అప్ ఇండియా, ఎంఎస్ఎంఈ తదితర పథకాల కింద బ్యాంకుల సహకారంతో కొత్తయూనిట్లు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం సూర్యఘర్ యోజన, ఊర్జా మిత్ర పథకాల గురించి చర్చించారు. గ్రామీణ రోడ్లకు మరమ్మతులు, సిమెంటు రోడ్ల ఆవశ్యకతపై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి కుటుంబం నుంచీ ఫ్యామిలీ ప్రొఫైల్ తయారు చేయాలన్నారు. జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

సుడిగాలి పర్యటన

రేణిగుంట నుంచి నాయుడుపేట వరకు ఆరులేన్ల జాతీయ రహదారిని పరిశీలిస్తూ.. పనుల పరోగతిని ప్రద్యుమ్న ఆరాతీశారు. నాయుడుపేట ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద పనులను పరిశీలించారు. ఇక నాలుగు శాతం పనులు మిగిలాయని రోడ్డునిర్మాణ సంస్థ నిర్వాహకులు వెల్లడించారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్నారు.

నారావారిపల్లెలో ఇలా..

నారావారపల్లెలో చేపట్టబోయే పనుల గురించి కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. పాఠశాలల్లో అధునాతన మౌలిక సదుపాయాలు, డిజిటల్ తరగతి గదులను శ్రీసిటీ ద్వారా రూ.80లక్షల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. యువతకు వృత్తి విద్య నైపుణ్య శిక్షణ.. పాడి పశువులకు గోకులాలు.. 242 స్వయం సహాయక మహిళా సంఘాలకు డ్రోన్ నిర్వహణ, ఈ-ఆటో కింద కొందరికి రుణ సదుపాయం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి, రామ్మోహన్, డీపీవో సుశీలదేవి, అధికారులు పాల్గొన్నారు.

● తిరుమల నుంచి తిరుగు ప్రయాణంలో..

వేగం తెచ్చిన అనర్థం

● వృద్ధురాలి మృతి ● నలుగురికి తీవ్ర గాయాలు

● పరమేశ్వర మంగళం వద్ద ఘటన

● సురక్షితంగా బయట పడ్డ చిన్నారి



గాయపడిన వైష్ణినేతిలి



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

పుత్తూరు అర్బన్, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని దర్శించుకుని చెన్నై కీలంబాకంకు బయలుదేరిన టీఎన్ 66 క్యూ 9263 కారు ప్రమాదానికి గురైంది. పుత్తూరు సమీపంలోని పరమేశ్వర మంగళం వద్ద ఉదయం 11.15 గంటలకు ప్రమాదం జరిగింది. ఇదే గ్రామం హరిజనవాడకు చెందిన ఐలయ్య భార్య శాంతకుమారి(60) రోడ్డు దాటుతుండగా కారు ఆమెను వేగంగా ఢీ కొంది. ఈ క్రమంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, అదుపు తప్పిన కారు రోడ్డు పక్కన ఉన్న బండరాయిని ఢీకొట్టింది. కారు నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు తల్లి సీతాలక్ష్మీ, తండ్రి పళనిస్వామి, కుమారుడు నవనీత కృష్ణ, కోడలు వైష్ణినేతిలికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి సురక్షితంగా బయటపడింది. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కారును నవనీత కృష్ణ నడుపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన శాంతకుమారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలకు హాజరైన వారిపై దూసుకెళ్లిన కారు

● ముగ్గురికి తీవ్రగాయాలు ● ఒకరి మృతి

● పాక్షికంగా దెబ్బతిన్న పలు ద్విచక్ర వాహనాలు, ఆటో



కారు దూసుకెళ్లడంతో దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలు



మృతి చెందిన కొండారెడ్డి

ఏర్పేడు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలకు హాజరైన వారిపై కారు దూసుకెళ్లిన ఘటనలో వృద్ధుడు మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరికి చెందిన గాది వెంకటేష్(35) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. వెంకటేష్ అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు గ్రామం వద్ద నిర్వహిస్తుండగా వెంకటగిరి నుంచి తిరుపతి వైపు వెళుతున్న కారు అదుపు తప్పి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దుర్గిపేరికి చెందిన కొండారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డితో పాటు కృష్ణంపల్లికి చెందిన గెరటారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అంతేకాకుండా రోడ్డు పక్కనే ఉన్న పలు ద్విచక్ర వాహనాలు, ఆటో దెబ్బతిన్నాయి. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ఆటోలో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొండారెడ్డి(75) మృతి చెందాడు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. కొండారెడ్డికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

పరకామణి దొంగతనంపై 'ఎంక్వైరీ కమిషన్' వేయండి

● టీటీడీ చైర్మన్‌కు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి విజ్ఞప్తి



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న భానుప్రకాష్

తిరుమల, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ లెక్కింపుల పరకామణిలో దొంగతనం కేసుపై 'ఎంక్వైరీ కమిషన్' వేయాలంటూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి మంగళవారం సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. అనంతరం భానుప్రకాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గతంలో పరకామణిలో పనిచేసిన రవికుమార్ దొంగతనం చేయగా కేసు పెట్టారని, పోలీసుల ఒత్తిడితో లోక్‌అదాలత్‌లో రాజీపడ్డామని అప్పుడు పనిచేసిన విజిలెన్స్ అధికారులు నివేదిక ఇచ్చారని, దానిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. తిరుపతి, చెన్నైలోని రవికుమార్ ఆస్తులను టీటీడీకి బదిలీ చేశారన్నారు. ఈ పంచాయితీ ఏంటని ఆయన ప్రశ్నించారు. రాజీకి పొమ్మని చెప్పిన పోలీసు అధికారులు ఎవరో తెలియాలన్నారు. దీనిపై కమిషన్ వేసేంతవరకు బోర్డు సభ్యుడిగా పోరాడతానని చెప్పారు.

'పద్మావతి' సముదాయం లీజు రద్దుపైనా..

తిరుచానూరులోని టీటీడీకి చెందిన పద్మావతి యాత్రికుల వసతి సముదాయం కలెక్టరేట్‌కు ఇచ్చారని, దాని లీజు రద్దుపై పోరాటం కొనసాగిస్తానని భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం కలెక్టరేట్‌కు కేటాయించడంపై తాను హైకోర్టుకు వెళ్లానన్నారు. గత ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి ట్రాన్సిట్ అకామిడేషన్ త్వరలోనే తెలియజేస్తామని, అప్పటివరకు టీటీడీకి నెలకు రూ.21.50 లక్షల అద్దెను జీఎస్టీసహా చెల్లిస్తామని తెలిపిందన్నారు. తాజాగా లీజును మరో మూడేళ్లకు పెంచడంతో పాటు క్లీనింగ్ కోసం రూ.7 లక్షలు కూడా టీటీడీనే ఇవ్వాలంటూ కలెక్టరేట్ నుంచి లేఖ వచ్చిందన్నారు. ఈ క్లీనింగ్ నిధులను ఆపడంతో పాటులీజు రద్దు చేయాలని చైర్మన్‌ను కోరానన్నారు.

రూ.20 లక్షల ఎర్రచందనం దుంగల స్వాధీనం

● ముగ్గురు ప్రధాన స్మగ్లర్ల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

మంగళం, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా నాగలాపురం మండలం రెప్పాల తిప్ప సమీప అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడులు చేశారు. రూ.20లక్షల విలువైన 69 ఎర్రచందనం దుంగలతో పాటుగా ముగ్గురు ప్రధాన స్మగ్లర్లను, ఐదుగురు కూలీలను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇంచార్జి, ఎస్పీ సుబ్బరాయుడు కథనం మేరకు.. టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి అందిన సమాచారంతో సోమవారం రాత్రి రెప్పాల తిప్ప అటవీ ప్రాంతంలో ఆకస్మిక దాడులు చేశారు. అక్రమంగా రవాణా చేయడానికి సిద్ధంగా ఉంచిన 69 ఎర్రచందనం దుంగలను, కేవీబీపురానికి చెందిన సురేంద్ర, నాగలాపురానికి చెందిన మునివేలు, తమిళనాడు సేలం జిల్లాకు చెందిన మేస్త్రి సెల్వరాజ్ తొరైస్వామి అనే ముగ్గురు స్మగ్లర్లను, తమిళనాడుకు చెందిన ఐదుగురు కూలీలను అదుపులోకి తీసుకున్నారు. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న ప్రధాన స్మగ్లర్లను అరెస్టు చేయడానికి దర్యాప్తు చేస్తున్నారు. కేసు చేదనలో ప్రతిభ చూపిన ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీ ఎండీ షరీఫ్, ఆర్ఐ చిరంజీవి, ఇన్స్‌పెక్టర్ సురేష్ కుమార్, ఆర్ఎస్ఐ నరేష్, సిబ్బందిని ఇన్చార్జి సుబ్బరాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

యూటీఎఫ్ అధ్యక్షుడిగా రాజశేఖర్



రాజశేఖర్ - ముత్యాలరెడ్డి - మధుసూదన్‌రెడ్డి

తిరుపతిరూరల్ (గాంధీరోడ్డు), డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశాల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జీజే రాజశేఖర్, ప్రధానకార్యదర్శిగా కె.ముత్యాలరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా దండు రామచంద్రయ్య, సహాధ్యక్షులుగా ఎం.కుమారస్వామి, గీతమ్మ, కోశాధికారిగా కె.మోహన్‌బాబు, కార్యదర్శిగా బండి మధుసూదన్‌రెడ్డి (తిరుపతి), ఎస్.శేఖర్, ప్రభాకర్, సుధీర్, మస్తానయ్య, హరిబాబు, సురేష్, పద్మజ, విజయ్‌కుమార్, వెంకటకృష్ణ, ఆదినారాయణ, విజయశ్రీ, గోవర్ధన్‌రెడ్డి, హేమాంబరధరరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా నిర్మల, ముత్యాలరెడ్డి, రాజశేఖర్, వాసుదేవరావు, సదాశివరెడ్డి, సునీల, రమేష్ నాయుడు, నాగరాజు, కోటేశ్వరరావు, ఆడిట్ కమిటీ సభ్యులుగా మోహన్, శివకుమార్, నాగేశ్వరరావు, సురేష్, చంద్రశేఖర్, దీపిక, రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ముక్కంటి సేవలో జపనీయులు



శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళవారం 8 మంది జపాన్ దేశస్థులు దర్శించుకున్నారు. ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని వారు పేర్కొన్నారు. ఆలయ సూపరింటెండెంట్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ లోగోతో తిరుమలకు కారు



తిరుమల, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా తెలుగుదేశం పార్టీకి చెందిన లోగోతో ఓ కారు తిరుమలకు వచ్చింది. సాధారణంగా రాజకీయ గుర్తులు, జెండాలు, వ్యక్తుల ఫొటోలు, చిహ్నాలతో తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరి వద్ద తనిఖీల్లో భద్రతా సిబ్బంది గుర్తించి అడ్డుకోవాలి. అయినా, మంగళవారం పద్మావతి ఏరియాలో ఓ వాహనంపై టీడీపీ లోగో ఉండటం చర్చనీయాశంగా మారింది. అలిపిరి వద్ద తనిఖీల లోపం వల్లే ఇలా జరిగిందన్న విమర్శలున్నాయి.

27న వాలీబాల్ జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 27న శాప్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ వాలీబాల్ జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆ రోజున ఉదయం 7గంటలకు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్, పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలతో హాజరుకావాలని తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 7నుంచి 13వరకు జైపూర్‌లో జరిగే సీనియర్ పోటీలకు అర్హత సాధిస్తారని వివరించారు.

సైబర్ ఉచ్చులో శ్రీసిటి ఉద్యోగి

● ఖాతాలో రూ.లక్ష మాయం

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడి శ్రీసిటి ఉద్యోగి ఆర్ఎస్ రెడ్డి తన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.లక్ష పోగొట్టుకున్నారు. సూళ్లూరుపేటలో జరిగిన ఈ విషయం మంగళవారం వెలుగు చూసింది. ఈయన మొబైల్‌కు రెండు రోజుల కిందట ఓ యాప్ వచ్చింది. దీనిని సద్వినియోగం చేసుకొంటే సులభంగా నగదు సంపాదించవచ్చనే మెసేజీ యాప్‌లో వచ్చింది. ఆ యాప్‌ను ఓపెన్ చేయడంతో నాలుగు విడతలుగా ఈయన ఖాతాలో ఉన్న రూ.లక్ష వరకు డ్రా అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భీములవారిపాళెంలో బోటు షికారు

● జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దనరెడ్డి

తడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచడానికి భీములవారిపాళెం రేవులో బోటు షికారు ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటకశాఖ అధికారి జనార్దనరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన భీములవారిపాళెం పడవల రేవును ఆర్డీవో కిరణ్మయి, డీఎస్పీ చెంచుబాబుతో కలిసి పరిశీలించారు. బోటు షికారు ఏర్పాట్లపై ఆరా తీశారు. రేవు పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. బోటు షికారుకు పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వచ్చే ఆస్కారం ఉన్నందున 30 పడవల వరకు ఏర్పాటు చేయాలని మత్స్యకార నాయకులకు ఆర్డీవో కిరణ్మయి సూచించారు. ఈ కార్యక్రమంలో వన్యప్రాణి విభాగం డీఎఫ్‌వో హారిక, తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో విజయకుమార్, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు, సర్పంచు గీతాప్రకాష్, టీడీపీ నాయకులు బొమ్మన శ్రీధర్, సుధాకర్, జయపాల్, వాసు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఆరుగురికి పదేళ్ల జైలు

● రూ.20 వేల జరిమానా

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఆరుగురు నిందితులకు పదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. సూళ్లూరుపేటకు చెందిన ఓ బాలికకు మోసపూరిత మాటలు చెప్పి లైంగికంగా వేధించిన ఆరుగురిపై 2014లో పోక్సో కేసు నమోదైంది. మంగళవారం నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ విచారణ పూర్తిచేసి నేరం రుజువు కావడంతో నిందితులు మల్లపు భానుప్రకాష్, మల్లపు వెంకటేశ్వర్లు, మల్లపు సుభాషిణి, అక్కరపాక స్వాతి, అక్కరపాక రమేష్, రేవూరి మాల కొండయ్యకు పదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

లా కోర్సుల్లో ప్రవేశానికి రేపు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ నిర్వహిస్తున్న లా కోర్సుల్లో ప్రవేశానికి గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 10 గంటలకు అడ్మిషన్ల కార్యాలయంలో సంప్రదించాలని వర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ ఊకా రమేష్‌బాబు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ జనార్దనరెడ్డి

గూడూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల ద్వారా మానసికోల్లాసం పొందుతారని డాక్టర్ జనార్దనరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో అల్లూరు ఆదిశేషారెడ్డి వర్ధంతి సందర్భంగా రోటరీక్లబ్, క్రికెట్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరు ఆదిశేషారెడ్డి పట్టణంలో స్టేడియం నిర్మాణం, రోటరీ హెల్పేజ్ పథకానికి, రోటరీ భవన నిర్మాణం తదితర కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో గుర్తిండిపోయారన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు అలవాటు పడి క్రీడలను మర్చిపోతున్నారన్నారు. క్రీడల వలన శారీరక దృఢత్వం పెరుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో మునిగిరీష్, అనీల్, శ్రీధర్‌రెడ్డి, జీజీనాయుడు, దశరధరామిరెడ్డి, లవకుమార్, రజనీకుమార్, విజయ్‌కుమార్, రామ్‌ప్రసాద్, రమణారెడ్డి, వెంకటేశ్ తదిరులు పాల్గొన్నారు.

క్వారీ యజమానుల దోపిడీని అరికట్టండి



ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీఎంపీ నెలవలకు వినతిపత్రం ఇస్తున్న శివకుమార్, మునీష్

నాయుడుపేట/పెళ్లకూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులకు వినియోగించే మెటల్‌కు సీనరేజ్ పేరుతో క్వారీ యజమానులు చేస్తున్న దోపిడీ అరికట్టాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కందమూడి శివకుమార్ కోరారు. మంగళవారం ఆయన తిరుపతిలో కలెక్టర్ వెంకటేశ్వర్, నాయుడుపేటలో ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంను కలిసి వినతిపత్రాలు అందజేశారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో క్వారీ యజమానులు విచ్చలవిడిగా దోపిడీకి పాల్పడ్డారన్నారు. అదే సంస్కృతి ఇప్పటికీ కొనసాగిస్తున్నారని, దీనిపై జిల్లా మంత్రులతో పాటు, ఉన్నతాధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం సభ్యులు కలవకోలు మునీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన ఖోఖో ఎంపిక పోటీలు



ఖోఖో జట్టు సభ్యులతో డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఖోఖో ఎంపిక పోటీలు మంగళవారం ముగిశాయి. దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల ఖోఖో క్రీడా పురుషుల విభాగానికి సంబంధించి ఈనెల 20నుంచి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈనెల 27న చెన్నైలో సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ మద్రాసులో అంతర్ విశ్వవిద్యాలయ ఖోఖో క్రీడల్లో ఈ జట్టు పాల్గొంటుంది. ఎన్‌బీకేఆర్ నుంచి ఖోఖో జట్టుకు ఎంపికైన శ్రవణ్‌కుమార్, అలెక్స్ చెందును కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి అభినందించారు.

వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇవ్వాలి

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యయసాయానికి రోజుకు 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని మన్నెముత్తేరి గ్రామ రైతులు డిస్కం అధికారులను కోరారు. మంగళవారం మన్నెముత్తేరి సబ్‌స్టేషన్‌లో ఏఈ మురళి ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయానికి 9 గంటల కరెంట్ ఇవ్వాలని అధికారులను కోరారు. అదే విధంగా మన్నెముత్తేరి గ్రామానికి సూళ్లూరుపేట పట్టణ ఫీడర్ నుంచి కరెంట్ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ కరెంట్ మోటర్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాల్లో వివరించారు. ఈ కార్యక్రమంలో జేఈ సుజన, ఎల్ఐ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ మురళి అన్నారు. మాంబట్టు సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం పరిశ్రమల ప్రతినిధులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, వర్షాల సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లకు దగ్గరగా ఎవరూ వెళ్లవద్దని సూచించారు. సమావేశంలో విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ ప్రసాద్

కోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు బాలకృష్ణ, ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

చేయూత అనాథాశ్రమానికి అవార్డు



స్నేహలత చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న తొప్పాని కృష్ణ, పక్కన డీటీ జయరామ్, ఏఎస్‌వో సురేంద్ర, ఆహార భద్రతాధికారి నర్మద

నాయుడుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా సదస్సు నిర్వహించారు. వినియోగదారుల న్యాయం, డిజిటల్ సౌలభ్యం, వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాయుడుపేటకు చెందిన చేయూత అనాథాశ్రమానికి ఉత్తమ ఎన్‌జీవో అవార్డు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు స్నేహలత చేయూత అనాథాశ్రమ నిర్వాహకుడు తొప్పాని కృష్ణకు అవార్డు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు మల్లికార్జున, ఉషాదేవి, వినియోగదారుల సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన వారిపై కేసు

చిట్టమూరు, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం అరవపాళెం గ్రామంలో ఈనెల 21న మహిళపై దాడి చేసిన వారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. అరవపాళెం గ్రామానికి చెందిన నల్లమాకల రమణమ్మ అరవపాళెం సచివాలయ సమీపంలో గొర్రెలు మేపుకుంటుండగా ఆమె భర్త సుబ్రహ్మణ్యం, ఆయన బంధువులు దాడి చేశారు. 60 గొర్రెలను బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించుకుని వెళ్లారని రమణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి భర్త సుబ్రహ్మణ్యంతో పాటు ఆయన బంధువులు 7మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్యామసుందరపురం గ్రామానికి చెందిన కొండాపురం అంకమ్మ అనే మహిళ వద్ద నుంచి 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని, ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

ఎక్కడ చూసినా చెత్త కుప్పలే!

- అపరిశుభ్రంగా రోడ్లు
- పారిశుధ్య లోపంతో జనం అవస్థలు



తోలిమిట్టలో రోడ్డుపై చెత్త

వెంకటగిరి టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. పలు వార్డుల్లో ప్రజలు కుండీల్లో పడేసే చెత్తను పారిశుధ్య కార్మికులు తొలగించడం లేదు. కుండీలు నిండిపోయి చెత్త రోడ్డుపైకి చేరుతోంది. పందులు, కుక్కలు, ఆవులు చెత్త కుప్పల వద్ద సంచరిస్తుండడంతో పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి. దీంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులకూ ఇబ్బందులు తప్పడంలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్లపై చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తుండడంతో పాటు పారిశుధ్యం లోపిస్తుండడంతో అంటువ్యాధులు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పట్టణంలో చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపాలిటీలో గాడి తప్పుతున్న పాలన

రెండు నెలలకుగా మున్సిపల్ కమిషనర్ లేకపోవడంతో పాలన గాడి తప్పింది. పట్టణంలో అభివృద్ధి పనులు జరగడం లేదు. కొత్త కమిషనర్ వచ్చి రెండు రోజులు కూడా విధులు నిర్వహించకుండా వెళ్లిపోయారు. ఇన్‌ఛార్జి కమిషనర్ నామమాత్రంగా వ్యవహరిస్తుండడంతో మున్సిపాలిటీలోని అన్ని విభాగాల్లో అలసత్వం నెలకొంది. అధికారులు, సిబ్బందిలో విధులకు హాజరవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మున్సిపాలిటీని తనిఖీ చేసి అధికారులను హెచ్చరించిన వారి తీరు మారలేదు. మరోవైపు పట్టణంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్ల పరిశీలన



సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో ఆర్డీవో కిరణ్మయి, టూరిజం శాఖ అధికారి జనార్దనరెడ్డి, డీఎస్పీ చెంచుబాబు, తహసీల్దార్ నరసింహరావు, డీఎఫ్‌వో హారిక తదితరులు

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించే జూనియర్ కళాశాల మైదానాన్ని మంగళవారం ఆర్డీవో కిరణ్మయి, జిల్లా టూరిజంశాఖ అధికారి జనార్దనరెడ్డి స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. పండుగ నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం పులికాట్ సరస్సు, అట్టకానితిప్ప వద్దనున్న పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలించారు. సందర్శలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. అలాగే దొరవారిసత్రం మండల పరిధిలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని అధికారుల బృందం పర్యటించి ఏర్పాట్లపై చర్చించింది. ఈసీ సెంటర్, చెక్‌లిస్టు ప్రాంతం, చెరువు కట్టపై పక్షుల వీక్షణ ప్రదేశాలను పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం దొరవారిసత్రం నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా పక్షుల కేంద్రానికి ఉన్న మార్గమే కాకుండా కలగుంట, నెల్లూరుపల్లి, మైలాంగం మీదుగా నేలపట్టు పక్షుల కేంద్రా నికి ఉన్న మరో రోడ్డు మార్గాన్ని కూడా పక్షుల పండుగ సమయంలో ఉపయోగించుకొనేలా ఏర్పాట్లు చేపట్టేందుకు అధికారులు చర్చించారు. ఈ కార్యక్రమాల్లో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, డీఎఫ్‌వో ఈ.హారిక, నేలపట్టు ఎఫ్ఆర్‌వో సౌజన్య, సూళ్లూరుపేట ఎంపీడీవో ప్రమీలారాణి, తహసీల్దార్ నరసింహరావు, సీఐ మురళీకృష్ణ, దొరవారి సత్రం తహసీల్దార్ శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, నాయుడుపేట రూరల్ సీఐ సంఘమేశ్వరరావు, ఎస్ఐ అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





గూడూరు, సూళ్లూరుపేటల్లో విద్యుత్ దీపాలంకరణతో మెరిసిపోతున్న చర్చిలు

క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు



వెంకటగిరిలో కేక్‌లు పంపిణీ చేస్తున్న గుణకల లక్ష్మీప్రసన్న ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

గూడూరు, చిల్లకూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగకు చర్చిలు ముస్తాబయ్యాయి. గూడూరు పట్టణంలోని చర్చిలు, ప్రార్థనా మందిరాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. మంగళవారం రాత్రి పట్టణంలోని వివిధ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ఎస్ఏఎల్‌సీ, ప్రార్థనా మందిరం, హోసన్నా మందిరం, యరోషిలేము ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవ సోదరులు ప్రార్థనా గీతాలను ఆలపించి ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు. నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చిల్లకూరు మండలంలోని ఏరూరు సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి వద్ద 35 అడుగుల భారీ స్టార్‌ను ఏర్పాటు చేశారు. సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండు సమీపంలో లూథరన్ చర్చి, హోలీక్రాస్ కూడలిలో ఉన్న చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించి సుందరబంగా ముస్తాబు చేశారు. క్రైస్తవులు మంగళవారం సాయంత్రం చర్చిల్లో ప్రార్థనలు చేశారు. వెంకటగిరి పట్టణంలోని కాశీపేటలో ఉన్న పరిశుద్ధ పేతులూరు లూథర్ చర్చి, చింతగుంటలో ఉన్న సీయోన్ గాస్పాల్ చర్చి పాస్టర్ డేవిడ్, కోళ్లపారం వద్ద ఉన్న బెరయ ప్రార్థన మందిరంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను పురష్కరించుకుని చర్చిలకు విద్యుత్ కాంతులతో అలంకరించారు. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభిస్తున్నామని చర్చి ఫాదర్‌లు వివరించారు. పట్టణంలోని పేతురు లూథరన్ చర్చి ఆవరణలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలంలోని 66 చర్చిలకు గుణకల లక్ష్మీప్రసన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కేక్‌లు పంపిణీ చేశారు. ముఖ్య అతిధులుగా హాజరైన సీఐ రమణ, రోటరీక్లబ్ నిర్వహకులు కేక్ కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుణకల లక్ష్మీప్రసన్న ఛారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ధనంజయ, సతీమణి లక్ష్మీప్రసన్న, ట్రెజరర్ జయచంద్ర, ప్రభాకర్, రోటరీ క్లబ్ ప్రెసిండెంట్ టీకే ప్రసాద్, సుధాకర్ నాయుడు, విజయ్, కృష్ణయ్య, రమేష్ తదతరులు పాల్గొన్నారు.

షార్‌లో సీఐఎస్ఎఫ్ ఏడీజీ తనిఖీలు

సూళ్లూరుపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ డిప్యూటీ జనరల్ పద్మాకర్ మంగళవారం షార్‌లోని సీఐఎస్ఎఫ్ యూనిట్ విభాగాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. షార్ మొదటి, రెండో గేటు, ప్రయోగ వేదికల వద్ద భద్రత గురించి తెలుసుకొన్నారు. ఆయన వెంట సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజిత్ కుమార్ తదితరులు ఉన్నారు.

భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

వాకాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నట్లు తహసీల్దారు రామయ్య తెలిపారు. మండలంలోని మూలపడవ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై 42 వినతులు వచ్చాయని, వాటిని త్వరితగతిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని తహసీల్దారు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కిషోర్, ఆర్ఐ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా తప్పనిసరి

ఓజిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం తిరుమలపూడి, కుందాం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో విజయలక్ష్మి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా విత్తన ఎంపిక, నారుమళ్ల తయారీ, ఎరు వులు, పురుగు మందుల వాడకం గురించి అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట ఎరువుల ఆవశ్యకతను వివరించారు.

వెంకటగిరి టౌన్ (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జీకే పల్లి, కుమ్మరిపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ నాగర్జున సాగర్, ఏవో సుజాత మాట్లాడుతూ ప్రతి రైతూ పంటల బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్ఎన్ఆర్ 15048 వగడం సాగు, ఎరువుల యాజమాన్యం, చీడ పీడల నివారణ, పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు వేసుకోవాల్సిన టీకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రామమోహన్, గోపీకృష్ణ, శ్రీప్రియ, లావణ్య, వేణు, రైతులు పాల్గొన్నారు.

గూడూరులో చిరుజల్లులు

గూడూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావం వల్ల పట్టణంలో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడ్డాయి. చలితీవ్రత పెరగడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.

ఓజిలిలో ముసురు

ఓజిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు చిరుజల్లులు పడ్డాయి. కాగా సాయంత్రం 4 గంటలకే చీకట్లు అలుముకున్నాయి. చలిగాలులు కూడా తోడవడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటవచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షాలకు నిమ్మతోటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన పడుతున్నారు.

రైల్వే కాంట్రాక్టరుదే ఇనుప పెట్టె

తడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాళంగి నదిలో కొట్టుకువచ్చి చేనిగుంట నది ఒడ్డున చేరిన ఇనుపపెట్టె రైల్వే కాంట్రాక్టరుదేనని నిర్ధారణ అయింది. చేనిగుంట కాళంగినది ఒడ్డున ఇనుప పెట్టె కలకలం రేపిన విషయం విదితమే. దీనిపై వార్తలు వెలువడటంతో అది తమదేనంటూ రైల్వే కాంట్రాక్టర్లు ముందుకువచ్చారు. సూళ్లూరుపేట సమీపం కాళంగినదిపై ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద గత కొద్ది రోజులుగా సిమెంట్ గడ్డర్ల మార్పు పని జరుగుతోంది. పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు కాళంగినది పొంగడంతో రైల్వే బ్రిడ్జికి ఉపయోగించే మూడు ఇనుప పెట్టెలు కొట్టుకుపోయాయి. అందులో ఒకటి సోమవారం బయటపడటంతో రైల్వే కాంట్రాక్టర్ మురళీరెడ్డి అది తమదేనంటూ చెప్పుకొచ్చారు. మిగిలిన రెండు దొరకాల్సి ఉందన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎం యూపీ పాఠశాలలో మంగళవారం క్రిస్మస పండుగను పురస్కరించుకుని ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో పొనకా మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, సురేష్‌రెడ్డి, శ్రీనివాసులు, కరిముల్లా, మల్లికార్జున్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్ దబ్బల

సూళ్లూరుపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యులు మంగళవారం ఇడుపులపాయలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

27న పోరుబాట

వెంకటగిరి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజల నడ్డి విరిచేలా కరెంటు ఛార్జీలను పెంచుతున్నందుకు నిరసనగా ఈనెల 27న వెంకటగిరి పట్టణంలోని సబ్‌స్టేషన్ వద్ద పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తామని వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, బాలయ్య, శ్రీనివాసులురెడ్డి, శంకరయ్య తెలిపారు. మంగళవారం నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి నివాసంలో పోరుబాట కరపత్రాలు ఆవిష్కరించారు. కౌన్సిలర్లు కల్యాణి, వహిదా, సుజాత, ప్రసాద్‌రెడ్డి, దానీబాషా, నారాయణ, రాజారెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లి పాల్గొన్నారు.

ఫైనాన్స్ కంపెనీల దోపిడీని అరికట్టాలి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల్లా వెలిసి జనాన్ని దోపిడీ చేస్తున్న ఫైనాన్స్ కంపెనీల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీవీ రమణయ్య అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సెల్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ఫర్నీచర్, ఎలక్ట్రానిక్స్ పరికరాలతో పాటు హౌసింగ్ లోన్లు ఇస్తామంటూ ఫైనాన్స్ సంస్థలు బోర్డులు పెట్టుకుని ఏజెంట్ల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. హౌసింగ్ లోన్ల కోసం ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను కూడా దళారుల ద్వారా రిజిస్టర్ చేసుకుంటున్నారని, తీరా ఖర్చుల పేరిట పెద్ద మొత్తంలో వసూలు చేసి కొంత నగదు లబ్ధిదారుల చేతుల్లో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి జనాన్ని దోపిడీ చేస్తున్న ఫైనాన్స్ కంపెనీల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి



జడ్పీ చైర్ పర్సన్ అరుణమ్మకు వినతిపత్రం అందజేస్తున్న విజయశ్రీ

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరుస వరదలతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో పంటలు నీటి మునిగిపోయాయని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నెల్లూరులో జరిగిన జడ్పీ సమావేశంలో చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా పశువైద్యశాలలో వైద్యులు లేక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సిబ్బందిని కేటాయించాలని కోరారు. ఈ మేరకు చైర్ పర్సన్‌కు ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దారు చంద్రశేఖర్, పక్కన అర్జీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. మంగళవారం గూడూరు మండలం వెందోడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు అందజేసే తెలియజేసే సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, సర్వేయర్ విశ్వనాధం, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాతనాలపాడులో రెవెన్యూ సదస్సు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

డక్కిలి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వగ్రామమైన డక్కిలి మండలం పాతనాలపాడులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాసులుకు స్థానికులు వినతులు అందజేశారు. వైసీపీ పాలనలో తమ గ్రామం అభివృద్ధి గురించి ఎవ్వరూ పట్టించుకోలేదని గ్రామస్తులు అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూముల సర్వే, మ్యుటేషన్ కల్పించాలని అర్జీలు అందజేశారు. వీటన్నింటినీ ఆన్‌లైన్ చేసి సత్వర పరిష్కారం చూపడం జరుగుతుందని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్ రాజగోపాల్, ఆర్ఐ ప్రియాంక, ఏఎస్‌వో వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మధుసూదనరెడ్డికి భూమిరత్న పురస్కారం



భూమిరత్న పురస్కారం అందుకొంటున్న మధుసూదనరెడ్డి

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో అధునాతన పనిముట్లు ఉపయోగించి, నూతన వరి వంగడాలను సాగుతో అధిక దిగుబడులు సాధిస్తూ ఆదర్శ రైతుగా పేరొందిన సూళ్లూరుపేట మండలం వెలగలపొన్నూరుకు చెందిన శిసనంబేటి మధుసూదనరెడ్డికి భూమిరత్న పురస్కారం అందుకున్నారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్‌లో ఇన్నోవేటివ్ ఫార్మింగ్ ఫౌండేషన్ రైతు సహాయక వేదిక కార్యక్రమం నిర్వహించింది. అధునాతన డ్రమ్ సీడర్ పరికరాలను స్వయంగా తయారీ చేసి, అతను వినియోగించడమే కాకుండా ఇతర రైతులకు ఇస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నందుకు శిసనంబేటి మధుసూదనరెడ్డికి భూమిరత్న పురస్కారం అందజేశారు.